


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:162 | Vol-01 ::: Issue-162
హైదరాబాద్ 12 జనవరి 2026, సోమవారం | Hyderabad 12 January 2026, Monday
పేజీలు: 8, వెల: రూ. 5/- | Pages: 8, Rs. 5/-




## కేరళలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

**ఎన్డీయే గెలుపు కేవలం ఆరంభమేనన్న అమిత్ షా** | **తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎల్డీఎఫ్ 40 ఏళ్ల ఆధిపత్యానికి చెక్**



**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్) :**

కేరళ రాజకీయాల్లో చారిత్రక మార్పు మొదలైందని, రాష్ట్రంలో బీజేపీ ముఖ్యమంత్రిని పీఠంపై కూర్చోబెట్టడమే తమ అంతిమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ప్రకటించారు. కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, తిరువనంతపురంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు.తిరువనంతపురం కార్పొరేషన్‌లో గత 40 ఏళ్లుగా సాగుతున్న ఎల్డీఎఫ్ పాలనకు ముగింపు పలికిన ఓటర్లకు అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు. 101 వార్డుల్లో 50 వార్డులను కైవసం చేసుకుని బీజేపీ అతిపెద్ద శక్తిగా అవతరించడం కేవలం ఒక మైలురాయి మాత్రమేనని, ఇక్కడి నుంచి కేరళ అసెంబ్లీ వైపు మా ప్రయాణం సాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం కనుమరుగవుతోందని, దేశంలో కాంగ్రెస్ తన ప్రాభవాన్ని కోల్పోయిందని అమిత్ షా ఎద్దేవా చేశారు. కేరళలో కాంగ్రెస్ , కమ్యూనిస్టులు బయటకు విమర్శించుకున్నా, లోపల మాత్రం 'మ్యాచ్ ఫిక్సింగ్' చేసుకుంటున్నారని , వీరి అవినీతి, అపవిత్ర పొత్తుల వల్లే కేరళ అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షా విమర్శించారు.2047 నాటికి ప్రధాని మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్' సాధనలో కేరళ అభివృద్ధి అత్యంత కీలకమని షా పేర్కొన్నారు. రాష్ట్ర భద్రతను, శతాబ్దాలుగా వస్తున్న ప్రజల విశ్వాసాలను కాపాడే సత్తా కేవలం ఎన్డీయేకే ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు ప్రజలకు వినయంతో సేవ చేయాలని, ప్రతి గడపకూ మోదీ సందేశాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



## అమెరికాలో హత్యాకాండ.. ఆరుగురు బలి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాలో మరోసారి తుపాకీ మోత కలకలం రేపింది. మిసిసిప్పీ రాష్ట్రంలోని క్లే కౌంటీలో జరిగిన కాల్పుల ఘటన దేశవ్యాప్తంగా ఆందోళనకు గురి చేసింది. 24 ఏళ్ల యువకుడు ఒకే రాత్రిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కాల్పులు జరిపి ఆరుగురిని హత్య చేశాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి గ్రామీణ ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతుల్లో నిందితుడి తండ్రి, సోదరుడు, మామతో పాటు ఏడేళ్ల చిన్నారి, ఓ చర్చ్ పాస్టర్, ఆయన సోదరుడు ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడిని డారికా ఎం. మూర్‌గా గుర్తించారు. ఘటన తర్వాత మిసిసిప్పీ రాష్ట్రంలోని సీడర్‌బ్లఫ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రోడ్డుబ్లాక్ వద్ద శనివారం అర్ధరాత్రికి ముందు అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో స్థానిక, రాష్ట్ర, ఫెడరల్ పోలీసు బలగాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.

...::: తరువాయి 3వ పేజీలో..



## శాఖ ఒకరిది... పెత్తనం మరొకరిది

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఒకవైపు సినిమా టికెట్ల ధరలు పెంచుతూ ప్రభుత్వం జీవోలు విడుదల చేస్తుంటే, ఆ శాఖ మంత్రికి మాత్రం తనకు ఏమీ తెలియదని చెప్పడం ప్రభుత్వంలోని అస్తవ్యస్తతకు నిదర్శనమని మండిపడ్డారు. థియేటర్ల కంటే సచివాలయంలోనే పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఐటీ మంత్రిని నేనే, సివిల్ ఏవియేషన్ మంత్రిని నేనే అని చెప్పుకునే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో జరుగుతున్న నిర్ణయాలపై తనకు సంబంధం లేదని అనడం విడ్డూరంగా ఉంది. సాక్షాత్తు ఒక క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే జీవోలు ఎలా వస్తున్నాయి? ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఆ 'రాజ్యాంగేతర శక్తి' ఎవరో సమాధానం చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## ఖమ్మం జిల్లాలో రూ. 547 కోట్ల స్కామ్

...::: పూర్తి కథనం 2వ పేజీలో..




## అమెరికా, ఇజ్రాయెల్‌లకు వార్నింగ్

**ప్రతీకారానికి సిద్ధమన్న ఇరాన్**
**ఇజ్రాయెల్ లో హై అలర్ట్**
**ఇరాన్ లో అత్యవసర పార్లమెంట్ సమావేశం**
**అప్రమత్తమైన అగ్రరాజ్యం**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


ఇరాన్ ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తున్నారని, వారికి సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇరాన్ పాలకులకు ఆగ్రహాన్ని కలిగించాయి. ఇరాన్ దేశంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిరసనలు ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, కరెన్సీ రియాల్ విలువ కనిష్ఠ స్థాయికి పడిపోవడం , ఆకాశాన్నంటిన జీవన వ్యయాలతో విసిగిపోయిన ప్రజలు గతేడాది డిసెంబర్ 28 నుండి వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. నిరసనకారులను అణచివేసేందుకు ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించినప్పటికీ, ఆందోళనలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఆజ్యం పోసినట్లయింది. ఇరాన్ ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తున్నారని, వారికి సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇరాన్ పాలకులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ అత్యవసరంగా సమావేశమై దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ అమెరికా, ఇజ్రాయెల్‌లను ఉద్దేశించి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడికి ప్రయత్నిస్తే, అమెరికాతో పాటు ఇజ్రాయెల్‌ను కూడా తమ ప్రధాన లక్ష్యాలుగా మార్చుకుంటామని, ఆ దేశాలపై ప్రతీకార దాడులు చేస్తామని స్పష్టం చేశారు. పార్లమెంట్ లోపల సభ్యులందరూ అమెరికాకు వ్యతిరేకంగా, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. బాహ్య శక్తుల ప్రేరేపిత నిరసనలను సహించేది లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. మరోవైపు, ఇరాన్ నుండి వస్తున్న హెచ్చరికలతో ఇజ్రాయెల్ ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. ఇప్పటికే 2023లో ఇరాన్ మద్దతు ఉన్న హమాస్ మిలిటెంట్ల నుంచి దాడులను ఎదుర్కొన్న ఇజ్రాయెల్, మరోవైపు హెజ్‌బొల్లా గ్రూపులతోనూ సుదీర్ఘ కాలంగా పోరాడుతోంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దుల వెంబడి రక్షణను కట్టుదిట్టం చేసింది. అమెరికా వైఖరి వల్ల తమ దేశంపై ఎక్కడ దాడి జరుగుతుందోనన్న ఆందోళనలో ఇజ్రాయెల్ ఉంది. మొత్తానికి ఇరాన్‌లోని అంతర్గత సమస్యలు ఇప్పుడు అంతర్జాతీయ యుద్ధ మేఘాలు కమ్ముకోవడానికి దారితీస్తున్నాయి.

## నేను ఫోన్ , ఇంటర్నెట్ వాడను

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఆధునిక యుగంలో ఇంటర్నెట్ , మొబైల్ ఫోన్ లేకుండా ఒక్క క్షణం కూడా గడవని పరిస్థితి. కానీ, దేశ రక్షణకు సంబంధించి అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకునే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాత్రం వీటికి ఆమడ దూరంలో ఉంటారట. శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026' లో పాల్గొన్న సందర్భంగా ఆయన వెల్లడించిన ఈ విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "నేను ఇంటర్నెట్ వాడను, మొబైల్ ఫోన్ కూడా ఉపయోగించను అన్న మాట వాస్తవం. కేవలం కుటుంబ సభ్యులతో లేదా అత్యవసర పరిస్థితుల్లో ఇతర దేశాల ప్రతినిధులతో మాట్లాడేందుకు మాత్రమే చాలా పరిమితంగా ఫోన్ వాడుతుంటాను. ఇవి లేకుండానే నా రోజువారీ విధులను నిర్వర్తించేలా ప్రణాళిక వేసుకుంటాను" అని అజిత్ దోవల్ వివరించారు.

**ఇండియన్ జేమ్స్ బాండ్ రహస్యం**



కమ్యూనికేషన్‌కు మనం వాడుతున్నవే కాకుండా, సామాన్య ప్రజలకు తెలియని రహస్య మార్గాలు ఎన్నో ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో 3,000 మంది యువ ప్రతినిధులను ఉద్దేశించి అజిత్ దోవల్ ప్రసంగిస్తూ.. భవిష్యత్తు భారతాన్ని నడిపించే నాయకులకు 'నిర్ణయాలు తీసుకునే శక్తి' అత్యంత ముఖ్యమని చెప్పారు. మోటివేషన్ అనేది తాత్కాలికమని, కానీ క్రమశిక్షణ మాత్రమే స్థిరమైన విజయాలను ఇస్తుందని హితవు పలికారు.




## సోమనాథ్ ఆలయం స్వాభిమానానికి ప్రతీక

**ఎన్ని దండయాత్రలు జరిగినా, ఎన్ని శతాబ్దాలు గడిచినా సోమనాథ్ ఆలయ వైభవం చెక్కుచెదరలేదని, వెయ్యేళ్ల తర్వాత కూడా ఆలయ శిఖరంపై భారతీయ ధర్మ జెండా రెపరెపలాడుతూనే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మూడు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా సోమనాథ్ ఆలయాన్ని ఆదివారం సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.**

**గుజరాత్ (ఏడీఎన్ఎన్) :**


సోమనాథ్ ఆలయ చరిత్రపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని ప్రధాని మోదీ విమర్శించారు. "బానిస మనస్తత్వంతో కొందరు ఈ క్షేత్ర ప్రాముఖ్యతను విస్మరించారు. సర్దార్ పటేల్ ఆలయ పునర్నిర్మాణానికి నడుం బిగిస్తే, ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. చివరికి తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆలయాన్ని సందర్శించాలనుకున్నప్పుడు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేయడం విచారకరం" అని ఆయన ధ్వజమెత్తారు. 1026 జనవరిలో గజనీ మహమ్మద్ చేసిన క్రూరమైన దండయాత్రను ప్రధాని గుర్తుచేసుకున్నారు. "సోమనాథ్‌పై అనేక దాడులు జరిగాయి. కానీ ప్రతిసారీ ఈ ఆలయం తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ పునర్వైభవాన్ని సంతరించుకుంది. ఇది మన దేశ ప్రజల దృఢ సంకల్పానికి, త్యాగానికి నిదర్శనం. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ అనేది కేవలం ఒక ఉత్సవం కాదు, అది భారతదేశ విశ్వాసానికి ప్రతిబింబం," అని ఆయన స్పష్టం చేశారు. 1951 మే 11న రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో పునరుద్ధరించబడిన ఈ ఆలయం, నేడు ప్రపంచానికి భారతదేశ స్ఫూర్తిని చాటుతోందని మోదీ వెల్లడించారు. గజనీ దండయాత్రకు వెయ్యేళ్లయిన సందర్భంగా ప్రధాని రాసిన ప్రత్యేక వ్యాసాన్ని కూడా ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు.

## నేడే పోలవరం లింక్ ప్రాజెక్టుపై విచారణ

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా లీగల్ టీమ్‌కు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, సుప్రీంకోర్టులో ప్రతి అంశాన్ని సాక్ష్యాధారాలతో వివరించాలని సూచించారు. ప్రతి సంవత్సరం సుమారు 3,000 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని, అందులో నుంచి కేవలం 200 టీఎంసీలను మాత్రమే ఏపీ వినియోగించుకోవాలని కోరుతోందని మంత్రి గుర్తు చేశారు. గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ ప్రకారం మిగులు జలాలను వాడుకునే హక్కు దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ఉందని బలంగా వాదించాలని అధికారులను ఆదేశించారు. వృథాగా పోతున్న నీటిని మళ్లించి కరువు ప్రాంతమైన రాయలసీమను సస్యశామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,

...::: తరువాయి 2వ పేజీలో..





## కివీస్‌పై 'కింగ్ కోహ్లీ' గర్జన

**తొలి వన్డేలో భారత్ ఘనవిజయం..** | **కొత్త ఏడాదిని ఘనంగా చాటిన టీమిండియా!**


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత పురుషుల క్రికెట్ జట్టు 2026 కొత్త ఏడాదిని ఘనమైన విజయంతో ఆరంభించింది. వడోదర వేదికగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన తొలి వన్డేలో టీమిండియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించి, మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగుల భారీ స్కోరు చేసింది. కివీస్ బ్యాటర్లలో డార్లీ మిచెల్ (84), డెవాన్ కాన్వే (56), హెన్రీ నికోల్స్ (62) అర్ధ శతకాలతో రాణించగా, భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రానా తలా రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. తర్వాత 301 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే రోహిత్ శర్మ వికెట్ కోల్పోయి షాక్ తగిలినా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

...::: తరువాయి 7వ పేజీలో..

## విశ్వవేదికపై పవన్ కల్యాణ్ ప్రతిభ

**జపనీస్ కత్తిసాము విద్యలో అరుదైన గుర్తింపు**



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

జనసేనాని, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు' లో ఆయన అధికారికంగా ప్రవేశం పొందారు. మూడు దశాబ్దాలకు పైగా పవన్ కల్యాణ్ మార్షల్ ఆర్ట్స్ రంగంలో సాగించిన నిరంతర సాధన, క్రమశిక్షణ , పరిశోధనలకు దక్కిన ఫలితంగా ఈ ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ సంస్థ 'గోల్డెన్ డ్రాగన్స్', పవన్ కల్యాణ్‌ను "ఇండియన్ టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్" అనే విశిష్ట బిరుదుతో సత్కరించింది. ఒక తెలుగు వ్యక్తికి, భారతీయ నాయకుడికి అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి గౌరవం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పవన్ కల్యాణ్ కేవలం నటుడిగానే కాకుండా, యుద్ధ కళలలో నిష్ణాతుడన్న విషయం ఈ గుర్తింపుతో మరోసారి నిరూపితమైంది.

...::: తరువాయి 2వ పేజీలో..




## యుద్ధ ప్రాతిపదికన ఎస్ఎల్‌బీసీ పనులు

**నల్గొండ కల సాకారం దిశగా అడుగులు!**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచంలోనే అత్యంత పొడవైన సాగునీటి సొరంగ మార్గంగా గుర్తింపు పొందిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేయడం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగం చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన జాప్యం వల్ల ఈ ప్రాజెక్టు కుంటుపడిందని, ఆ వైఫల్యాలను అధిగమించి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడం ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాకుండా ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా పారద్రోలడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి వెల్లడించారు. సొరంగ మార్గం తవ్వకాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని మంత్రి ఈ సందర్భంగా వివరించారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## మేడారానికి పోటెత్తిన భక్తజనం

...::: పూర్తి కథనం 5వ పేజీలో..



# ఆయనతో పనిచేయడం సులభం

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సంచలన వ్యాఖ్యలు
- మా కూటమిలో ఎలాంటి విభేదాలు లేవు.. ఐదేళ్లూ కలిసి ఉంటాం

**ముంబై (ఏడీఎన్ఎన్) :**

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాజీ సీఎంలు ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే ల పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక వార్తాసంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఇద్దరు నేతలతో కలిసి పనిచేసిన తన అనుభవాలను పంచుకుంటూ వారి వ్యక్తిత్వాల మధ్య ఉన్న తేడాలను విశ్లేషించారు. ఏక్‌నాథ్ షిండేతో కలిసి పనిచేయడం చాలా సులభమని , ఎందుకంటే ఆయన ఒక ఎమోషనల్ వ్యక్తని నా మనస్తత్వం కూడా దాదాపు అలాగే ఉంటుంది కాబట్టి మా మధ్య సమన్వయం బాగా కుదిరిందని ఫడ్నవిస్ అన్నారు . షిండేలోని భావోద్వేగాలను అర్థం చేసుకుంటే ఆయనతో వ్యవహరించడం చాలా తేలికని , తాను ఆయన కంటే కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాను, అందుకే మా జట్టు విజయవంతమైందని ఫడ్నవిస్ పేర్కొన్నారు. ఉద్ధవ్ ఠాక్రే గురించి మాట్లాడుతూ ఫడ్నవిస్ సెటైర్లు వేశారు. ఉద్ధవ్ ఠాక్రేను అంచనా వేయడం ఎవరికీ సాధ్యం కాదని , ఆయన మనసులో ఏముందో, ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థం చేసుకోవడానికి ప్రత్యేకంగా ఒక పరిశోధకుడిని నియమించాల్సి ఉంటుందన్నారు . ఆయనతో పనిచేయడం చాలా కష్టమైన పని అని వ్యాఖ్యానించారు. మహాయుతి కూటమిలో అంతర్గత కలహాలు ఉన్నాయన్న వార్తలను ఫడ్నవిస్ కొట్టిపారేశారు. మా ప్రభుత్వం స్థిరంగా ఉంది. ఐదేళ్ల పాటు కలిసి పనిచేస్తామని , షిండే ఢిల్లీ పర్యటనల గురించి కొందరు పనిగట్టుకుని పుకార్లు పుట్టిస్తున్నారని ఫడ్నవిస్ అన్నారు .



# ఖమ్మం జిల్లాలో రూ. 547 కోట్ల స్కామ్

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**

ఖమ్మం జిల్లాలో కళ్లు చెదిరే స్థాయి భారీ సైబర్ దోపిడీ వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి, విదేశాల్లో కాల్ సెంటర్ల ద్వారా నెట్‌వర్క్ నడుపుతున్న సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ఒక ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా దాదాపు రూ. 547 కోట్ల భారీ లావాదేవీలు జరిపినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. వీఎం బంజరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను తెలియజేశారు. నిందితులు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, రివార్డ్ పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్ పెట్టుబడులు , క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ వంటి వివిధ మార్గాల ద్వారా అమాయకులను నమ్మించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు విచారణలో భాగంగా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పోట్రు మనోజ్ కల్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రియ, మేడ సతీష్, మారంపూడి చెన్నకేశవతో పాటు మరో 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 24న సత్తుపల్లి మండలం తుమ్మూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ భారీ కుంభకోణం బయటపడింది. తనకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి నిందితులు రెండు బ్యాంకు ఖాతాలు తెరిపించారని, ఆ అకౌంట్ల ఏటీఎం కార్డులు, పాస్‌వర్డ్ లు తీసుకున్నారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. తన ఖాతాను స్వయంగా పరిశీలించుకోగా, అందులో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించి షాక్‌కు గురైనట్లు సాయికిరణ్ పోలీసులకు వెల్లడించాడు. పోలీసుల లోతైన దర్యాప్తులో నిందితుల మోసపూరిత వ్యూహం బయటపడింది. సత్తుపల్లి, వేంసూర్, లింగపాలెం వంటి పరిసర గ్రామాలలోని సామాన్యులను లక్ష్యంగా చేసుకుని, సేవింగ్స్ ఖాతా తెరిచినందుకు రూ. 5 వేలు, కరెంట్ అకౌంట్‌కు రూ. 10 వేలు ఆశ చూపి వారి పేరిట ఖాతాలు తెరిపించారు. ఆ బ్యాంకు వివరాలను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు విదేశాల్లో ఉంటూ డిజిటల్ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ముఠా ఉపయోగించిన బ్యాంకు ఖాతాలపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వందల సంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు సీపీ సునీల్ దత్ తెలిపారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాల వివరాలను, ఏటీఎం కార్డులను అపరిచితులకు ఇవ్వకూడదని, తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు వస్తుందన్న ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# విశ్వవేదికపై పవన్ కల్యాణ్ ప్రతిభ




మొదటిపేజీ తరువాయి....

పవన్ కల్యాణ్‌కు దక్కిన ఈ గౌరవంపై ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "చరిత్రలు రాసేవాళ్లు చాలా మంది ఉంటారు.. కానీ చరిత్రనే తుడిచేసేవాడు ఒక్కడే.. ఆయనే పవన్ కల్యాణ్.. భారత మార్షల్ ఆర్ట్స్ పులి.. ఆయనకు గౌరవం దక్కడం అంటే.. తెలుగు వారందరికీ దక్కిన గౌరవం.. కంగ్రాట్స్ సార్," అంటూ పవన్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. జపాన్ సమురాయ్‌లు ఉపయోగించే అత్యంత కఠినమైన, పురాతన కత్తిసాము విద్యే ఈ కెంజుట్సు. దీనిని నేర్చుకోవడమే కాకుండా, అందులో అధికారిక ప్రవేశం పొందడం అనేది ఒక యోధుడికి దక్కే అత్యున్నత గౌరవంగా భావిస్తారు. పవన్ కల్యాణ్ సాధించిన ఈ విజయం పట్ల ఆయన అభిమానులు మరియు పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

జయలలిత తర్వాత ఏఐఏడీఎంకేలో శూన్యం | పళనిస్వామి '210' సీట్ల మ్యాజిక్ లెక్క | విజయ్ 'టీవీకే' రూపంలో సరికొత్త సవాలు | బీజేపీతో పొత్తు.. లాభమా? నష్టమా?

# లెక్కలు బాగున్నాయి .. కానీ ఓట్లెక్కడ ?



**తమిళనాడు రాజకీయ వేదికపై 2026 అసెంబ్లీ ఎన్నికల సమరం మొదలైంది. దశాబ్దాల కాలంగా డీఎంకే, ఏఐఏడీఎంకేల మధ్యే సాగుతున్న ద్రవిడ ఆధిపత్య పోరులో ఈసారి సరికొత్త సమీకరణాలు తోడవుతున్నాయి. ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి తన కూటమి 210 స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, క్షేత్రస్థాయిలో పార్టీకి ఎదురవుతున్న సవాళ్లు విశ్లేషకులను ఆలోచింపజేస్తున్నాయి.**

**తమిళనాట సినీ గ్లామర్‌కు, రాజకీయాలకు విడదీయలేని బంధం**

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాడు రాజకీయాల్లో జయలలిత మరణం, ఏఐఏడీఎంకేలో భర్తీ చేయలేని లోటును మిగిల్చింది. ఆమె ఉన్నంత కాలం ఏకఛత్రాధిపత్యంగా సాగిన పార్టీ, ఆ తర్వాత మూడు వర్గాలుగా (పళనిస్వామి, పన్నీర్ సెల్వం, శశికళ) చీలిపోయింది. ఈ అంతర్గత వర్గ పోరాటాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేశాయి. ప్రస్తుతం పళనిస్వామి పార్టీ పగ్గాలను తన చేతుల్లోకి తీసుకున్నప్పటికీ, పన్నీర్ సెల్వం వర్గం,శశికళ, టీటీవీ దినకరన్ వంటి నేతలు బయటే ఉండటం పార్టీ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతోంది. డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ తన పరిపాలనతో, సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఒక బలమైన ముద్ర వేయగా, ఆయనను ధీటుగా ఎదుర్కొనే 'మాస్ లీడర్' ఇమేజ్ కోసం పళనిస్వామి ఇంకా శ్రమించాల్సి ఉంది. ఇటీవల జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో పళనిస్వామి ఒక సంచలన ప్రకటన చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే నేతృత్వంలోని కూటమి 210 స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ధీమా వెనుక ఉన్న ప్రధాన కారణం 2024 లోక్‌సభ ఎన్నికల ఓట్ల శాతం. ఆ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే కూటమి,బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ విడివిడిగా పోటీ చేసినప్పటికీ, వారిద్దరి ఉమ్మడి ఓట్ల శాతం సుమారు 41.33శాతం గా ఉంది. ఇప్పుడు ఈ రెండు పార్టీలు మళ్లీ ఏకమవ్వడంతో,డీఎంకే కూటమిని సులభంగా ఓడించవచ్చని పళనిస్వామి భావిస్తున్నారు. ఈ ఐక్యత వల్ల సుమారు 84 అసెంబ్లీ సెగ్మెంట్లలో తాము ఇప్పటికే ముందంజలో ఉన్నామని,ఇదే ఊపు కొనసాగితే 210 సీట్లు సాధించడం అసాధ్యం కాదని ఆయన క్యాడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు. తమిళనాట సినీ గ్లామర్‌కు,రాజకీయాలకు విడదీయలేని బంధం ఉంది. 2026 ఎన్నికల్లో స్టార్ హీరో విజయ్ తన పార్టీ 'తమిళగ వెట్రి కజగం' తో బరిలోకి దిగుతుండటం అతిపెద్ద మలుపు. విజయ్ తన రాజకీయ శత్రువు డీఎంకే అని, సిద్ధాంతపరమైన శత్రువు బీజేపీ అని ప్రకటించారు. అయితే, ఆయన రాక ఏఐఏడీఎంకే ఓట్లను ఎక్కువగా చీల్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా యువత , మార్పు కోరుకునే ఓటర్లు విజయ్ వైపు మొగ్గు చూపితే,అది ప్రధాన ప్రతిపక్షమైన ఏఐఏడీఎంకేకు నష్టం కలిగించవచ్చు. పళనిస్వామికి ఇది ఒక అగ్నిపరీక్ష వంటిది ఒకవైపు బలమైన డీఎంకేను ఎదుర్కోవాలి, మరోవైపు విజయ్ వంటి కొత్త శక్తులు తన ఓటు బ్యాంకును దెబ్బతీయకుండా చూసుకోవాలి. ఏఐఏడీఎంకేకు బీజేపీతో ఉన్న పొత్తు ఒక రెండంచుల కత్తి లాంటిది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గణనీయంగా ఓట్ల శాతాన్ని పెంచుకుంది, ఇది ఏఐఏడీఎంకేకు బలాన్ని ఇస్తుంది. అయితే,మైనారిటీ ఓటర్లు, ద్రవిడ సిద్ధాంతాలకు కట్టుబడే వర్గాలు బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నాయి. పళనిస్వామి ఇప్పటికే ముఖ్యమంత్రి అభ్యర్థిగా తన పేరును ప్రకటించుకున్నారు.అధికారంలోకి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారాన్ని ఇతరులతో పంచుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఇది సీట్ల సర్దుబాటు సమయంలో బీజేపీతో విభేదాలకు దారితీసే అవకాశం ఉంది. అటు బీజేపీ కూడా తమిళనాడులో తన ఉనికిని చాటుకోవాలని చూస్తోంది,కాబట్టి సీట్ల పంపకం పళనిస్వామికి కత్తిమీద సాము కానుంది. ఏఐఏడీఎంకే తక్షణమే అధికారానికి ప్రత్యామ్నాయంగా మారాలంటే కొన్ని కీలక మార్పులు అవసరం. విడిపోయిన వర్గాలు (పన్నీర్ సెల్వం, శశికళ) తిరిగి కలిస్తేనే ఆ పార్టీ తన పాత వైభవాన్ని, 40 శాతం ఓటు బ్యాంకును తిరిగి పొందగలదు. డీఎంకే ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా అవినీతి ఆరోపణలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఏఐఏడీఎంకే సమర్థవంతంగా తన వైపు తిప్పుకోవాలి.స్టాలిన్ ప్రవేశపెట్టిన పథకాలకు మించి మెరుగైన హామీలను ప్రజలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఏఐఏడీఎంకే మనుగడకు 2026 అసెంబ్లీ ఎన్నికలు పెద్ద ప్రశ్న. పళనిస్వామి ఆశిస్తున్నట్లు 210 సీట్లు సాధించాలంటే, కేవలం గణిత శాస్త్ర లెక్కలు సరిపోవు. క్షేత్రస్థాయిలో ప్రజల నమ్మకాన్ని గెలవాలి. డీఎంకే కోటను బద్దలు కొట్టి ప్రత్యామ్నాయంగా నిలుస్తుందా లేదా అనేది పళనిస్వామి వ్యూహ చతురతపైనే ఆధారపడి ఉంది.

**- జాని మస్తాన్**



# హిందూ-హిజాబ్ వార్

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారత తదుపరి ప్రధానమంత్రి ఎవరనే అంశంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ , ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. హిజాబ్ ధరించిన మహిళను భారత ప్రధానిగా చూడాలన్న ఒవైసీ కలపై హిమంత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఈ వివాదంపై హిమంత బిస్వా శర్మ స్పందిస్తూ.. "రాజ్యాంగపరంగా ఎవరైనా ప్రధాని కావచ్చు, దానికి అడ్డంకులు లేవు. కానీ, భారతదేశం ఒక హిందూ దేశం, ఇక్కడ ఉన్నది హిందూ నాగరికత. అందుకే భవిష్యత్తులో కూడా భారత ప్రధానిగా ఎప్పుడూ ఒక హిందువే ఉంటారని మేము బలంగా నమ్ముతున్నాం" అని తేల్చి చెప్పారు. హిమంత వ్యాఖ్యలపై నాగ్‌పూర్‌లో స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అస్సాం సీఎం బుర్రలో ట్యూబ్‌లైట్ వెలుగుతోంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి ఇలా సంకుచితంగా మాట్లాడటం సిగ్గుచేటు. మన రాజ్యాంగం ఏ ఒక్క మతానికో, వర్గానికో సొంతం కాదు. ఇది నాస్తికులకు కూడా సమాన హక్కులు కల్పిస్తుంది" అని మండిపడ్డారు. ఒవైసీ తన ప్రసంగంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గొప్పతనాన్ని గుర్తుచేస్తూ, మతపరమైన పరిమితులు ఉండటానికి ఇది పాకిస్తాన్ కాదని , మన దేశ గొప్పతనమే భిన్నత్వమని ఒవైసీ అన్నారు . డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హిమంత కంటే ఎంతో విజ్ఞానవంతుడని ,రాజ్యాంగం గురించి కనీస అవగాహన లేకుండా హిమంత చిల్లర మాటలు మాట్లాడుతున్నారని , అని ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సైబర్ మాయగాళ్ల వలలో వృద్ధ దంపతులు



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. ఏకంగా ఐక్యరాజ్యసమితిలో 48 ఏళ్ల పాటు సేవలందించి రిటైర్ అయిన ఒక వృద్ధ దంపతులను టార్గెట్ చేసి, వారి నుంచి రూ. 14.85 కోట్లను కాజేశారు. దాదాపు 17 రోజుల పాటు వారిని 'డిజిటల్ అరెస్టు' పేరుతో ఇంట్లోనే బందీలుగా ఉంచి, వారి జీవితకాల కష్టాన్ని దోచుకున్న వైనం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. డాక్టర్ ఓం తనేజా, ఆయన భార్య డాక్టర్ ఇందిరా తనేజాలు గతంలో ఐక్యరాజ్యసమితి లో సుదీర్ఘకాలం పనిచేశారు. 2015లో భారత్‌కు తిరిగి వచ్చిన వీరు ఢిల్లీలో నివసిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 24న వీరికి పోలీసు అధికారులమంటూ సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వారి పేరిట క్రిమినల్ కేసులు ఉన్నాయని, అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయని బెదిరించారు. నేరగాళ్లు వీడియో కాల్స్ ద్వారా ఆ దంపతులను నిరంతరం పర్యవేక్షిస్తూ, డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు ఎవరితోనూ మాట్లాడకుండా 'డిజిటల్ అరెస్టు' చేశారు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని నమ్మించి, విడతల వారీగా మొత్తం రూ. 14.85 కోట్లను వివిధ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. అంతా అయిపోయాక, పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఆర్బీఐ ద్వారా డబ్బులు తిరిగి వస్తాయని నమ్మబలికారు. డబ్బులు వస్తాయన్న ఆశతో ఆ వృద్ధ దంపతులు శనివారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆరా తీయగా, అసలు విషయం బయటపడింది. వారిపై ఎలాంటి కేసులు లేవని, తాము మోసపోయామని గ్రహించిన దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నేడు ఇస్రో మరో ప్రయోగం PSLV-C62

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నేడు పీఎస్ఎల్‌వీసీ-62తో పీఎస్ఎల్‌వీ శ్రేణిలో 64వ ప్రయోగించనుంది. ఇస్రో నిర్వహిస్తోంది. విజయాల్లో 'పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్' పాత్ర చిరస్మరణీయం . ప్రస్తుతం చేపడుతున్న పీఎస్ఎల్‌వీ సీ-62 ద్వారా డిఆర్డీవో రూపొందించిన అత్యాధునిక EOSN1 (అన్వేష) భూ పరిశీలన ఉపగ్రహంతో పాటు 15 విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఖచ్చితత్వం, తక్కువ ఖర్చు, విశ్వసనీయతతో పీఎస్ఎల్‌వీ ఇస్రోకు నిజమైన 'నమ్మిన బంటు'గా నిలిచింది. ఇస్రో 1990లలో మొదలైన ఈ రాకెట్ ప్రయాణం నేటి వరకు అనేక చారిత్రాత్మక మైలురాళ్లను దాటింది. పీఎస్ఎల్‌వీ చరిత్రలో అత్యంత కీలక ఘట్టం 2008లో జరిగిన చంద్రయాన్1 ప్రయోగం. పీఎస్ఎల్‌వీసీ-11 ద్వారా భారత్ తొలిసారి చంద్రుడిపైకి ఉపగ్రహాన్ని పంపి అంతరిక్ష రంగంలో తన ముద్ర వేసింది. చంద్రునిపై నీటి జాడను కనుగొనడంతో ఈ ప్రయోగం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. భూ కక్ష్యలకు మాత్రమే కాకుండా సుదూర అంతరిక్ష మిషన్లకు కూడా పీఎస్ఎల్‌వీ సిద్ధమని నిరూపించింది. కాలక్రమేణా పీఎస్ఎల్‌వీ సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ పలు వేరియంట్లుగా రూపాంతరం చెందింది. స్ట్రాపాన్ మోటార్లు లేని పీఎస్ఎల్‌వీసీ-ఏ తేలికపాటి ఉపగ్రహాల కోసం, శక్తివంతమైన బూస్టర్లతో కూడిన PSLVXL చంద్రయాన్, మంగళయాన్ వంటి కీలక మిషన్ల కోసం వినియోగించారు. అవసరానికి అనుగుణంగా PSLVDL, QL వేరియంట్లను కూడా ఇస్రో అభివృద్ధి చేసింది. ఇస్రో 2014లో మంగళయాన్‌ను అతి తక్కువ ఖర్చుతో అంగారక కక్ష్యలో చేర్చడం, 2017లో ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం ద్వారా పీఎస్ఎల్‌వీ ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. మూడు దశాబ్దాల ప్రయాణంలో అతి తక్కువ వైఫల్యాలతో పీఎస్ఎల్‌వీ ప్రపంచ శాటిలైట్ లాంచ్ మార్కెట్‌లో భారత్‌కు అగ్రగామి స్థానాన్ని తెచ్చిపెట్టింది.



# సీబీఐ విచారణకు దళపతి

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

తమిళనాట రాజకీయం మరోసారి ఆసక్తికర మలుపు తీసుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో నిందితుడిగా ఉన్న టీవీకే పార్టీ అధినేత విజయ్ సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కానున్నారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ దుర్ఘటనపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన సీబీఐ అధికారులు, మూడు రోజుల క్రితమే విజయ్‌కు సమన్లు జారీ చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా విజయ్ తన ఎన్నికల ప్రచారానికి ఉపయోగించిన ప్రత్యేక బస్సును సీబీఐ శనివారం సీజ్ చేసింది. సెప్టెంబర్ 27న కరూర్ సభ జరిగిన రోజు ఆ వాహనం ప్రయాణ వివరాలు, దానికి ఉన్న అనుమతులను నిర్ధారించుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి అధికారులు తనిఖీలు చేశారు. బస్సు డ్రైవర్‌ను కూడా సీబీఐ సుదీర్ఘంగా ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించింది. విజయ్ విచారణకు హాజరవుతున్న తరుణంలో సోషల్ మీడియాలో ఆయన అరెస్ట్‌పై ఊహాగానాలు జోరందుకున్నాయి. తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు టీవీకే మొగ్గు చూపుతోందని వార్తలు వస్తున్న తరుణంలో ఈ విచారణ జరగడం చర్చనీయాంశమైంది. అటు బీజేపీ కూడా విజయ్‌ను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోందని సమాచారం. విజయ్‌ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకే ఈ విచారణను వేగవంతం చేశారని ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఊహించని విధంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, 110 మందికి పైగా గాయపడ్డారు. మొదట రాష్ట్ర పోలీసులు విచారణ చేపట్టినప్పటికీ, బాధితుల విన్నపం మేరకు సుప్రీంకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు అత్యున్నత న్యాయస్థానం ముగ్గురు సభ్యుల కమిటీని కూడా నియమించింది. రేపు ఢిల్లీలో జరిగే విచారణ తర్వాత సీబీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. విజయ్ అరెస్ట్ అవుతారా? లేక విచారణ తర్వాత వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి. ఇప్పటికే పలువురు టీవీకే ముఖ్య నేతలను ప్రశ్నించిన అధికారులు, విజయ్ ఇచ్చే సమాచారంతో ఈ కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది.

# యుద్ధ ప్రాతిపదికన ఎస్‌ఎల్‌బీసీ పనులు

మొదటిపేజీ తరువాయి....

గతంలో సాంకేతిక లోపాలతో నిలిచిపోయిన పాత టీబీఎం స్థానంలో అత్యంత శక్తివంతమైన కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేసి తవ్వకాలను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. మిగిలి ఉన్న 9.8 కిలోమీటర్ల మేర భూగర్భ పరిస్థితులను, రాతి పొరల కఠినత్వాన్ని అంచనా వేసేందుకు నిర్వహించిన ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని అధికారులు మంత్రికి వివరించారు. భూమి లోపల పని సాగుతున్నప్పుడు అకస్మాత్తుగా ఎదురయ్యే సవాళ్లను ముందే గుర్తించే విధంగా అధునాతన సపోర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టులో నిరంతరం శ్రమిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. క్లిష్టమైన పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సొరంగం లోపల పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి వారి వేతనంలో 25 శాతం అదనపు జీతాన్ని అందించాలని మంత్రి నిర్ణయించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడం వల్ల పనుల వేగం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్ మరియు ఇతర నిపుణులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, ఎక్కడా జాప్యం జరగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# నేడే పోలవరం లింక్ ప్రాజెక్టుపై విచారణ


మొదటిపేజీ తరువాయి....

ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్రానికి సమర్పించామని ధర్మాసనానికి వివరించాలన్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను తక్షణమే లీగల్ టీమ్‌కు అందించాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న డీపీఆర్ పనులు కేవలం సన్నాహక చర్యలు మాత్రమేనని, చట్టబద్ధమైన అనుమతులకు లోబడే ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని కోర్టుకు విన్నవించాలని చెప్పారు. సముద్రంలో కలిసే వృథా జలాలను వాడుకోవడంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను గతంలోనే విచారించిన సుప్రీంకోర్టు, ఈ నెల 12కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. సోమవారం జరగబోయే ఈ విచారణలో సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందనేది ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయ , జలవనరుల వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాదనలతో ప్రాజెక్టు ఆవశ్యకతను నిరూపించేందుకు సిద్ధమవుతుండగా, తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ మరియు నీటి వాటాల అంశాలను ముందుకు తెచ్చే అవకాశం ఉంది. ఈ తీర్పు రాబోయే కాలంలో అంతరాష్ట్ర నదీ జలాల అనుసంధాన ప్రాజెక్టులకు దిక్సూచిగా మారనుంది.

# శాఖ ఒకరిది... పెత్తనం మరొకరిది

మొదటిపేజీ తరువాయి....

సినిమా రంగాన్ని ప్రభుత్వం రాజకీయ కక్షలు తీర్చుకునే అడ్డాగా మార్చుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్ష గడతారని , మీ పేరు మర్చిపోయినందుకు ఇంకో హీరోని ఇబ్బంది పెడతారని హరీశ్ రావు అన్నారు . ప్రభుత్వానికి నచ్చిన వారికి మాత్రం రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తూ రెడ్ కార్పెట్ వేస్తారా? అని నిలదీశారు. పాలకుడు అనేవాడు పాలసీతో ఉండాలి తప్ప, పగతో ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా టికెట్ల ధరల పెంపు ఉండదని చెప్పి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఒక్కో సినిమాకు కమిషన్ల రూపంలో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆ వివరాలను త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. ఈ సినిమా టికెట్ల ధరల దందాపై గవర్నర్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## ట్రంప్ 'పవర్ ప్లే'పై పుతిన్ మౌనరాగం ?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచంలో అమెరికా ఎక్కడైనా దురాక్రమణ చర్యలకు పాల్పడితే, క్రెమ్లిన్ నుంచి వెంటనే తీవ్ర స్థాయిలో స్పందన వచ్చేది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన వరుస 'పవర్ ప్లే' చర్యలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశ్చర్యకరంగా మౌనం పాటిస్తున్నారు. హెచ్చరికలు, ప్రతీకార బెదిరింపులు, సైనిక విన్యాసాలు సాధారణమే. కానీ 2026 ప్రారంభం నుంచి పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. వెనెజువెలా నేత నికోలస్ మదురోను అమెరికా అదుపులోకి తీసుకోవడం, రష్యా జెండాతో వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకోవడం, గ్రీన్‌లాండ్‌ను ఆక్రమిస్తామని ట్రంప్ బహిరంగంగా బెదిరించడం వంటి ఘటనలు జరిగినప్పటికీ, రష్యా నుంచి ఘాటు ప్రతిస్పందన లేకపోవడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఆధిపత్యాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశంతో వెనెజువెలా, ఆర్కిటిక్ ప్రాంతాల్లో రష్యా దశాబ్దాలుగా భారీగా పెట్టుబడులు పెట్టింది. అయినప్పటికీ మదురోను అరెస్టు చేసిన అంశంపై పుతిన్ ఇప్పటివరకు ఒక్క వ్యాఖ్య కూడా చేయలేదు. కొత్త ఏడాది ప్రారంభం నుంచి ఆయన జనవరి 6న ఆర్థోడాక్స్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో మాత్రమే బహిరంగంగా కనిపించారు. ఆయన అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్, ప్రభుత్వ టీవీ చానళ్లు కూడా ఈ వ్యవహారంపై మౌనం పాటించడం గమనార్హం. ఈ మౌనానికి ప్రధాన కారణం యుక్రెయిన్ అంశమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. యుక్రెయిన్ విషయంలో అమెరికాతో సాగుతున్న సున్నితమైన చర్చలకు ఎలాంటి విఘాతం కలగకూడదన్న ఉద్దేశంతో పుతిన్ సంయమనాన్ని పాటిస్తున్నట్లు అంచనా. ట్రంప్‌ను పూర్తిగా రష్యాకు వ్యతిరేకంగా మళ్లకుండా అడ్డుకోవడమే ప్రస్తుతం క్రెమ్లిన్ ప్రథమ లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ 2026ను నాటకీయ శక్తి ప్రదర్శనతో ప్రారంభించారు. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను డ్రగ్ అక్రమ రవాణా ఆరోపణలతో అదుపులోకి తీసుకుని న్యూయార్క్ కు తరలించారు. వెనెజువెలా తాత్కాలికంగా అమెరికా నియంత్రణలోకి వచ్చిందని ట్రంప్ ప్రకటించారు. ఈ చర్యను రష్యా ప్రభుత్వ మీడియాతో సంబంధం ఉన్న కొందరు విశ్లేషకులు ''మదురోను తొలగించడం రష్యా ప్రయోజనాలకు విరుద్ధం కాద''ని వ్యాఖ్యానించడం గమనార్హం. అమెరికా తన ప్రాబల్య ప్రాంతాల్లో ఈ విధంగా ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ద్వారా.. రష్యాకు కూడా తన పరిధిలో ఇలాంటి చర్యలకు అవకాశం కల్పించినట్లే అవుతుందని కొందరు క్రెమ్లిన్ అనుకూల వ్యాఖ్యాతలు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ ప్రభుత్వం గత డిసెంబర్‌లో విడుదల చేసిన నూతన జాతీయ భద్రతా వ్యూహానికి ఇది ఆచరణాత్మక ఉదాహరణగా వారు పేర్కొంటున్నారు. క్రెమ్లిన్‌కు సన్నిహితుడైన విదేశాంగ విధానాల నిపుణుడు ఫ్యోదోర్ లుక్యనోవ్..''అంతర్జాతీయ సంబంధాల్లో శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే ప్రాబల్య ప్రాంతాలు మళ్లీ కీలకంగా మారుతున్నాయి. ట్రంప్ థియరీ దీనిని స్పష్టంగా చూపిస్తోంది,'' అని వ్యాఖ్యానించారు. అమెరికా తాజా ఆంక్షలు తాత్కాలికంగా అసౌకర్యాన్ని కలిగించినా, దీర్ఘకాలంలో రష్యాకు లాభదాయకమేనని ఎంపీ యెవ్‌గెనీ పాపావ్ అభిప్రాయపడ్డారు. అమెరికా స్వాధీనం చేసుకున్న రష్యన్ ఆయిల్ ట్యాంకర్ 'మారినెరా' అంశంలోనూ రష్యా సంయమనం పాటించింది. నౌకలోని సిబ్బందిని సురక్షితంగా విడిచిపెట్టాలని మాత్రమే డిమాండ్ చేసింది. ప్రతీకార చర్యలు, సైనిక హెచ్చరికలపై మాత్రం ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. దీనిపై కొందరు రష్యా రాజకీయ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా కోస్ట్ గార్డ్ పై ప్రతీకార చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌మాన్ అలెక్సీ జురావ్లియోవ్ డిమాండ్ చేయడం కలకలం రేపింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం పుతిన్ దృష్టిలో ప్రస్తుతం వెనెజువెలా కంటే యుక్రెయిన్ చాలా పెద్ద అంశం. ట్రంప్‌తో జరగాల్సిన డీల్‌లో యుక్రెయిన్ కీలకంగా ఉండటంతో ఇతర అంశాలపై మౌనం వ్యూహాత్మకమేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మౌనం తాత్కాలికమా? లేక అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణలకు సంకేతమా? అన్నది రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.



## మయన్మార్‌లో చిక్కుకున్న 22 మందికి విముక్తి

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

మయన్మార్‌లో ఉద్యోగాల పేరుతో మోసపోయి బందీలుగా మారిన 22 మంది తెలుగు యువకులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటూ మోసపూరిత హామీలతో వీరిని మయన్మార్‌కు తీసుకెళ్లిన దళారులు, అక్కడ సైబర్ నేరాలకు పాల్పడే అంతర్జాతీయ ముఠాకు వీరిని బలవంతంగా అప్పగించినట్లు వెల్లడైంది. తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపుల మధ్య యువకులు అక్కడ నరకయాతన అనుభవించాల్సి వచ్చింది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో భారత విదేశాంగశాఖ తక్షణమే స్పందించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి మేరకు మయన్మార్ అధికారులతో సంప్రదింపులు జరిపి రక్షణ చర్యలు చేపట్టింది. బాధితులను గుర్తించి అక్కడి నుంచి విడిపించడంలో విదేశాంగశాఖ కీలక పాత్ర పోషించింది. అవసరమైన భద్రతా ఏర్పాట్లతో యువకులను భారత్‌కు తరలించారు. స్వదేశానికి చేరుకున్న వారు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## పాలస్తీనా వాసిపై దారుణం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



ఇజ్రాయెల్ లోని ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో మరోసారి హింస చెలరేగింది. దెయిర్ షరాఫ్ గ్రామ సమీపంలోని ఒక మొక్కల నర్సరీపై ముసుగులు ధరించిన సాయుధులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పాలస్తీనా వాసి అయిన 67 ఏళ్ల బధిరుడు బసిమ్ సలేహ్ యాస్సిన్‌ను దుండగులు దారుణంగా కొట్టారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నర్సరీ వద్దకు వచ్చిన దుండగులను చూసి అక్కడ పనిచేస్తున్న కార్మికులు భయంతో పారిపోయారు. బసిమ్‌కు హెచ్చరికలు చేసినప్పటికీ వినికిడి లోపం కారణంగా అతడు అక్కడే ఉండిపోయాడు. దుండగులు వచ్చీ రావడంతోనే అతడిని కాళ్లతో తన్నుతూ, కర్రలతో తీవ్రంగా కొట్టారు. నేలపై పడిపోయే వరకూ దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనలో బసిమ్ చేతి వేళ్లు విరిగిపోవడంతో పాటు శరీరమంతా గాయాలయ్యాయి. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు నర్సరీ నిర్వాహకులు తెలిపారు. ఈ అమానుష దాడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# వెనెజువెలా పై ట్రంప్ తహతహ?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**




ప్రపంచంలో ఏ దేశంతో పోల్చినా అత్యధికంగా ముడి చమురును ఉత్పత్తి చేస్తున్న దేశం అమెరికానే. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం 2025లో అమెరికా రోజుకు సగటున 13.4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును ఉత్పత్తి చేసి విక్రయించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తరచూ చమురు గురించి మాట్లాడుతుంటారు. అయితే ఆయన ప్రసంగాల్లో వినిపించే చమురు చర్చలు కేవలం 'అమెరికన్ ఆయిల్' వరకే పరిమితం కావు. భారీ స్థాయిలో దేశీయంగా చమురు ఉత్పత్తి చేస్తున్నా, ఇతర దేశాల చమురుపై ఎందుకు అమెరికా దృష్టి పెట్టుతోంది? చమురు నిల్వలు ఉన్నా కూడా ఎందుకు దిగుమతులపై ఆధారపడుతోంది? ఇదే అసలు ప్రశ్న. అమెరికా తన దేశంలో ఉత్పత్తి అయ్యే చమురుతో పూర్తిగా మనుగడ సాగించలేకపోతోందా? చమురు వ్యాపారానికి, వెనెజువెలా మధ్య ఉన్న సంబంధం ఏంటి ? ఈ ప్రశ్నలకు సమాధానం ముడి చమురు రకాలలో దాగి ఉంది. భూమి నుంచి వెలికితీసే ముడి చమురును (క్రూడ్ ఆయిల్) దాని సాంద్రత, సల్ఫర్ పరిమాణం, ప్రవాహ సామర్థ్యం ఆధారంగా వేర్వేరు గ్రేడ్లుగా వర్గీకరిస్తారు. స్థూలంగా చెప్పాలంటే ముడి చమురు రెండు ప్రధాన రకాలు. ఒకటి తేలికపాటి ముడి చమురు (లైట్ క్రూడ్ ఆయిల్). రెండోది భారీ ముడి చమురు (హెవీ క్రూడ్ ఆయిల్). ''ముడి చమురులో దాదాపు 160కి పైగా రకాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రిఫైనరీలు వాటికి అనుగుణంగా ప్రత్యేకంగా రూపకల్పన చేయబడ్డాయి'' అని ఇంధన విశ్లేషకుడు గౌరవ్ శర్మ తెలిపారు. భారీగా, గాఢంగా ఉండే ముడి చమురుతో పోలిస్తే తేలికపాటి ముడి చమురును శుద్ధి చేయడం చాలా సులభం. లైట్ క్రూడ్ ఆయిల్ నుంచి ఎక్కువగా పెట్రోలు, జెట్ ఫ్యూయల్ వంటి అధిక విలువైన ఇంధనాలు లభిస్తాయి. మరోవైపు హెవీ క్రూడ్ ఆయిల్‌ను ఓడలకు ఇంధనం, రోడ్డు నిర్మాణ సామగ్రి, ఇతర పారిశ్రామిక అవసరాలకు ఉపయోగిస్తారు. భారీ ముడి చమురుతో పోలిస్తే తేలికపాటి ముడి చమురు విలువ ఎక్కువ. అందుకే దాని ధర కూడా అధికమే. అమెరికా సందర్భంలో ఇదే కీలక అంశం. 2025లో అమెరికా రోజుకు సుమారు 1 కోటి 34 లక్షల బ్యారెళ్ల ముడి చమురును విక్రయించింది. అదే సమయంలో దాదాపు 20 లక్షల బ్యారెళ్ల చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ఇక్కడే సందేహం మొదలవుతుంది. తాము ఉత్పత్తి చేస్తున్న చమురును తమ అవసరాలకు ఎందుకు వినియోగించుకోవడం లేదు? అమెరికాలో లభిస్తున్న ముడి చమురు రకం, అక్కడ ఉన్న రిఫైనరీల సామర్థ్యం మధ్య ఉన్న తేడాలో ఉంది. అమెరికన్ పెట్రోలియం ఇన్‌స్టిట్యూట్ ప్రకారం అమెరికాలో ఉత్పత్తి అయ్యే ముడి చమురులో దాదాపు 80 శాతం తేలికపాటి చమురే. అమెరికాలోని చాలా రిఫైనరీలు గత శతాబ్దంలో భారీ ముడి చమురును శుద్ధి చేసేలా నిర్మించబడ్డాయి. మరోవైపు, 20వ శతాబ్దం పొడవునా అమెరికాకు సరఫరా అయిన చమురు ఎక్కువగా లాటిన్ అమెరికా, కెనడా నుంచి వచ్చిన హెవీ క్రూడ్ ఆయిల్. ఆ తర్వాత 2000ల ప్రారంభంలో పరిస్థితి మారింది. సాంకేతిక అభివృద్ధితో షేల్ రాళ్ల నుంచి పెద్ద మొత్తంలో లైట్ క్రూడ్ ఆయిల్ వెలికితీయడం సాధ్యమైంది. ఫలితంగా అమెరికా ఉత్పత్తి చేస్తున్న చమురు రకం, అక్కడి రిఫైనరీలు శుద్ధి చేయగల చమురు రకం ఒకదానికొకటి సరిపోవడం లేదు. ''ఒకసారి రిఫైనరీ నిర్మించాక దాన్ని పూర్తిగా మార్చడం చాలా కష్టం. దీనికి లక్షల నుంచి కోట్ల డాలర్ల పెట్టుబడి అవసరం. ఆర్థికంగా అది లాభదాయకం కాదు'' అని గౌరవ్ శర్మ చెప్పారు. అందుకే అమెరికా తన లైట్ క్రూడ్ ఆయిల్‌ను ఎక్కువ ధరకు అంతర్జాతీయ మార్కెట్లో అమ్మి, తక్కువ ధరకు హెవీ క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఇది పూర్తిగా ఆర్థిక లెక్కలపై ఆధారపడిన నిర్ణయం. ప్రపంచంలో అత్యధిక హెవీ క్రూడ్ ఆయిల్ నిల్వలు వెనెజువెలా , సౌదీ అరేబియా, ఇరాన్, కెనడా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, రష్యా, అమెరికా, లిబియాలలో ఉన్నాయి. వీటిలో వెనెజువెలా, ఇరాన్, రష్యాలు ప్రస్తుతం అమెరికా ఆంక్షల కింద ఉన్నాయి. అయినప్పటికీ వెనెజువెలా నుంచి కొంత చమురు అమెరికాకు చేరుతూనే ఉంది. దీనికి చారిత్రక నేపథ్యం ఉంది. వెనెజువెలా లో చమురు క్షేత్రాలు కనుగొనబడిన తర్వాత అక్కడి చమురు పరిశ్రమ నిర్మాణంలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయి. 20వ శతాబ్దంలో ఎక్కువ భాగం అమెరికా వెనెజువెలా నుంచే భారీ ఎత్తున ముడి చమురును దిగుమతి చేసుకుంది. ''ఇతర లాటిన్ అమెరికా దేశాల మాదిరిగా కాకుండా, వెనెజువెలా 1976లో చమురు జాతీయీకరణ చేసినప్పటికీ అమెరికాతో సంబంధాలను కొనసాగించింది'' అని నవ్రా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కార్మెన్ బీట్రిజ్ ఫెర్నాండెజ్ తెలిపారు. కానీ 1999లో హ్యూగో చావెజ్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. చమురు పరిశ్రమపై ప్రభుత్వ నియంత్రణను ఆయన మరింత బలోపేతం చేశారు. ''విదేశీ చమురు కంపెనీలపై కఠినమైన షరతులు విధించడం అమెరికా ప్రభుత్వానికి నచ్చలేదు'' అని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ గ్రేస్ లివింగ్‌స్టోన్ చెప్పారు. చావెజ్ మరణానంతరం నికోలస్ మదురో కూడా అదే విధానాలను కొనసాగించారు. 2019లో వరల్డ్ బ్యాంక్ ట్రిబ్యునల్ అమెరికన్ చమురు కంపెనీలకు పరిహారం చెల్లించాలని వెనెజువెలాను ఆదేశించింది. అది జరగకపోవడంతో వివాదాలు మరింత ముదిరాయి. 2025 చివర్లో అమెరికా సైన్యం వెనెజువెలా చమురు ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవడం, ఓడరేవులను దిగ్బంధించడం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను పెంచింది. వెనెజువెలా లో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు ఉన్నాయి. సుమారు 303 బిలియన్ బ్యారెళ్ల చమురు అక్కడ ఉన్నట్లు అంచనా. అయినప్పటికీ రోజుకు ఒక మిలియన్ బ్యారెళ్ల కంటే తక్కువే ఎగుమతి అవుతోంది. ఆంక్షలు, నిధుల కొరత, దుర్వ్యవస్థాపన ఇందుకు కారణాలు. ''సరైన స్థాయిలో చమురు సరఫరా పునరుద్ధరించడానికి కనీసం మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పడుతుంది'' అని గౌరవ్ శర్మ తెలిపారు. వాతావరణ మార్పులపై ఆందోళనలు పెరుగుతున్నా, ప్రపంచ వ్యవస్థలో చమురు పాత్ర ఇప్పటికీ కీలకంగానే ఉంది. ''చమురు పరిశ్రమ అనేక దేశాలకు అపారమైన సంపదను అందించింది. ఇది మల్టీ ట్రిలియన్ డాలర్ల పరిశ్రమ. రాత్రికి రాత్రే దేశాల భవితవ్యాన్ని మార్చగల శక్తి దీనికి ఉంది'' అని గౌరవ్ శర్మ వ్యాఖ్యానించారు.

## సిరియాపై అమెరికా వైమానిక దాడి


**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



సిరియాలో ఉగ్రవాద స్థావరాలపై అమెరికా భారీ వైమానిక దాడులకు తెగబడింది. 'ఆపరేషన్ హాకీ స్ట్రైక్'లో భాగంగా అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) దళాలు మిత్రరాజ్యాల సాయంతో సిరియాలోని విస్తరించి ఉన్న ఐసీస్ స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 30 కు పైగా ఐసీస్ స్థావరాలు పూర్తిగా నేలమట్టం చేసినట్లు అమెరికా తెలిపింది. సిరియాలో ఉగ్రవాద నెట్‌వర్క్ ను పూర్తిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు దాడులు ప్రారంభమైనట్లు సెంట్కామ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో తెలిపింది. ఈ దాడుల్లో 90కు పైగా ప్రెసిషన్ ఆయుధాలను ఉపయోగించగా, 35కుపైగా ఐసీస్ లక్ష్యాలను ఛేదించినట్లు సమాచారం. రెండు డజన్లకు పైగా యుద్ధ విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ''యూఎస్ దళాలు, మిత్రదేశాల భద్రతకు ముప్పుగా మారే ఎవరినైనా, వారు ఎక్కడ ఉన్నా గుర్తించి నిర్మూలిస్తాం'' అంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ హెచ్చరించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో అమెరికా నిరంతర నిబద్ధతకు ఈ ఆపరేషన్ నిదర్శనమని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు గత నెల 19న ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు యూఎస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు , గత నెల 13న సిరియాలోని పాల్మీరా ప్రాంతంలో జరిగిన ఐసీస్ దాడిలో ఇద్దరు యూఎస్ సైనికులు, ఒక అమెరికన్ పౌరుడు మృతి చెందడం ఈ చర్యకు కారణమైంది. మృతులను ఐయోవా నేషనల్ గార్డ్ కు చెందిన సార్జెంట్ ఎడ్గార్ బ్రియాన్ టోర్రెస్ టోవర్, సార్జెంట్ విలియం నాథనియల్ హోవార్డ్ గా గుర్తించారు.

## 'మచాడో నోబెల్ ట్రంప్ నకు ఇవ్వలేరు'

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**




ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం నెలకొన్న వివాదంపై నోబెల్ కమిటీ స్పందించింది. వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోకు దక్కిన నోబెల్ శాంతి పురస్కారంని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇవ్వలేరని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. ఒకసారి నోబెల్ బహుమతిని ప్రకటించిన తర్వాత దానిని రద్దు చేయడం, బదిలీ చేయడం, లేదా ఇతరులతో పంచుకోవడం అసాధ్యమని కమిటీ తేల్చి చెప్పింది. ఈ నిర్ణయం అంతిమమైనదని, ఎప్పటికీ చెల్లుతుందని కమిటీ వెల్లడించింది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకునే దిశగా అమెరికా చేపట్టిన చర్యల నేపథ్యంలో ట్రంప్‌కు నోబెల్ ఇవ్వడానికి లేదా పంచుకోవడానికి సిద్ధమని మచాడో ఇటీవల వ్యాఖ్యానించారు. ''ఇది వెనెజువెలా ప్రజల బహుమతి. ప్రజాస్వామ్య మార్పు కోసం ట్రంప్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం'' అని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో మచాడో తనకు లభించిన నోబెల్‌ను ట్రంప్‌కు అంకితం చేస్తారన్న చర్చ ఊపందుకుంది. ఇదే సమయంలో నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అనేక యుద్ధాలను తాను ఆపానని, నోబెల్‌కు తనకంటే అర్హుడు ఎవరూ లేరని ట్రంప్ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ''ఏమీ చేయకపోయినా'' నోబెల్ ఇచ్చారని అసహనం వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మచాడో చేసిన ప్రకటన మరింత రాజకీయ దుమారం రేపింది. మచాడోకు నోబెల్ శాంతి బహుమతి లభించడానికి కారణాలను నార్వే నోబెల్ కమిటీ వివరించింది. వెనెజువెలాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆమె శాంతియుతంగా సాగించిన పోరాటానికి గుర్తింపుగా ఈ పురస్కారం ఇచ్చినట్లు తెలిపింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా నిలబడి ప్రజాస్వామ్య సాధన కోసం ఆమె చేసిన కృషి అనేక మందికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొంది. బెదిరింపులు ఎదుర్కొంటూ, గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించినప్పటికీ ఆమె వెనుకడుగు వేయలేదని వెల్లడించింది. ఇదిలా ఉండగా, వెనెజువెలా అధ్యక్ష బాధ్యతలను మచాడోకు అప్పగించేందుకు ట్రంప్ విముఖత వ్యక్తం చేయడంపై కూడా చర్చ నడుస్తోంది. నోబెల్ బహుమతే ఇందుకు కారణమన్న ప్రచారం జోరందుకుంది. ఈ అంశంపై వాషింగ్టన్ పోస్టు ప్రచురించిన కథనం అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది. నోబెల్ అంశం ఇప్పుడు రాజకీయ రంగును సంతరించుకుంది.

## "సూసైడ్ బాంబర్లతో దాడి ".. జైష్-ఎ- చీఫ్

- 'వెయ్యికిపైగా సూసైడ్ బాంబర్లు సిద్ధం'
- జైష్ చీఫ్ అజార్ సంచలన వ్యాఖ్యలు

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మొహమ్మద్ కీలక నేత మసూద్ అజార్‌కు చెందిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో అతడు చేసిన వ్యాఖ్యలు భద్రతా వర్గాలను అప్రమత్తం చేస్తున్నాయి. తన వద్ద పెద్ద సంఖ్యలో ఆత్మాహుతి దాడులకు సిద్ధంగా ఉన్న ''సూసైడ్ బాంబర్లు'' ఉన్నారని అజార్ ప్రకటించాడు. వీరంతా భారత్‌పై దాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మసూద్ స్పష్టంగా చెప్పాడు. ''ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వెయ్యి మంది కాదు.. వెయ్యి మందికి పైగా సూసైడ్ బాంబర్లు సిద్ధంగా ఉన్నారు. భారతదేశంలోకి చొరబడేందుకు అనుమతించాలని వారు నాపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ సంఖ్యను బహిరంగంగా వెల్లడిస్తే ప్రపంచమే షాక్ అవుతుంది'' అంటూ అజార్ వ్యాఖ్యానించినట్లు ఆ ఆడియోలో ఉంది. ఉగ్ర దాడులకు పాల్పడి అమరవీరులవ్వాలన్న ఉద్దేశంతో వీరంతా ఎదురుచూస్తున్నారని చెప్పడం తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. ఐక్యరాజ్యసమితి గుర్తించిన అంతర్జాతీయ ఉగ్రవాది అయిన మసూద్ అజార్.. 2001 భారత పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో పాటు అనేక ఉగ్రకుట్రలకు సూత్రధారిగా ఉన్నాడు. గతేడాది 'ఆపరేషన్ సింధూర్' సమయంలో పాకిస్తాన్‌లోని బహవల్పూర్‌లో ఉన్న జైష్-ఎ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడుల్లో అజార్ కుటుంబానికి చెందిన పలువురు హతమయ్యారు. అయినప్పటికీ అతడి వైఖరిలో మార్పు కనిపించడం లేదు. 2019 నుంచి బహిరంగంగా కనిపించని అజార్ తాజా ఆడియోతో మరోసారి భారత్‌పై కుట్రలు పన్నుతున్నాడని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## భారత్ కు నన్ను చుస్తే భయం



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా డిప్యూటీ చీఫ్, పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సైఫుల్లా కసూరీ మరోసారి భారత్‌పై విషం చిమ్మాడు. పాక్ సైన్యం-ఉగ్రవాదుల మధ్య విడదీయలేని బంధాన్ని అతడి వ్యాఖ్యలు బట్టబయలు చేశాయి. పాక్ సైన్యం తమకు ఎలాంటి సంబంధం లేదంటూ అంతర్జాతీయ వేదికలపై చెప్పే వాదనలన్నింటినీ కసూరీ మాటలే ఖండిస్తున్నాయి. ఇటీవల పాకిస్తాన్ లోని ఓ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన కసూరీ, భారత్‌పై తీవ్ర ద్వేషాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశాడు. "పాకిస్తాన్ సైన్యం నన్ను గౌరవంగా ఆహ్వానిస్తుంది. మరణించిన పాక్ సైనికుల అంతిమ సంస్కారాల్లో నమాజ్ చేయమని నన్నే పిలుస్తారు. భారత్ కూడా నన్ను చూసి భయపడుతోంది" అంటూ అహంకారపూరితంగా మాట్లాడాడు. చిన్న పిల్లల ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్రవాదాన్ని చిన్నతనం నుంచే నాటే ప్రయత్నమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉగ్రవాదులు సైనికుల అంత్యక్రియల్లో పాల్గొనడం, పాక్ సైన్యం వారిని అధికారికంగా ఆహ్వానించడం చూస్తుంటే.. భారత్ ఆరోపిస్తున్న 'స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం' నిజమేనన్నది స్పష్టమవుతోంది. సైన్యం, ఉగ్రవాదం ఒకే నాణేనికి రెండు ముఖాలేనన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్ వంటి సంస్థలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. తాజా ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం.. ఆ దెబ్బ నుంచి కోలుకునేందుకు ఈ ఉగ్రసంస్థలు మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నాయి. నిధుల సేకరణ, కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా భారత్‌పై మరోసారి దాడులకు కుట్రలు పన్నుతున్నాయన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

## అమెరికాలో హత్యాకాండ.. ఆరుగురు బలి

**మొదటిపేజీ తరువాయి....**

క్లే కౌంటీ షెరీఫ్ ఎడ్డి స్కాట్ తెలిపిన వివరాల ప్రకారం, మూర్ మొదట పశ్చిమ క్లే కౌంటీలోని ఓ మట్టి రోడ్డుపై ఉన్న తన కుటుంబం వైపు వెళ్లాడు. అక్కడ తన తండ్రి గ్లెన్ మూర్ (67), సోదరుడు క్వింటన్ మూర్ (33), మామ విల్లీ ఎడ్ గైన్స్ (55)లను కాల్చి చంపాడు. తర్వాత మూర్ తన సోదరుడి ట్రక్కును దొంగిలించి కొద్ది మైళ్ల దూరంలో ఉన్న తన బంధువు ఇంటికి వెళ్లాడు. అక్కడ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఏడేళ్ల చిన్నారిని తుపాకీతో బెదిరించి కాల్చి చంపాడు. మరో చిన్నారిపై కూడా కాల్పులకు యత్నించినప్పటికీ ఆమె ప్రాణాలతో బయటపడింది. తుపాకీ పనిచేయలేదా, లేక నిందితుడు కాల్చలేదా అన్నది ఇంకా స్పష్టత లేదని అధికారులు తెలిపారు. ఈ ఘటన సమయంలో ఆ ఇంట్లో చిన్నారి తల్లి, మరో బిడ్డ కూడా ఉన్నట్లు వెల్లడించారు. ''ఏడేళ్ల చిన్నారిని హత్య చేయడం అత్యంత అమానుషం'' అంటూ షెరీఫ్ ఎడ్డి స్కాట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడితో ఆగని మూర్, ఆ తర్వాత అపోస్టోలిక్ చర్చ్ ఆఫ్ ది లార్డ్ జీసస్ అనే చిన్న చర్చ్ వద్దకు వెళ్లాడు. అక్కడ నివాసంలోకి చొరబడి పాస్టర్ రెవ. బ్యారీ బ్రాడ్లీ, ఆయన సోదరుడు శామ్యూల్ బ్రాడ్లీని కాల్చి చంపాడు. తర్వాత అక్కడి నుంచి మరో వాహనాన్ని దొంగిలించి పరారయ్యాడు. మొత్తం ఘటనపై మొదటి కాల్ వచ్చిన నాలుగు గంటలన్నర తర్వాత రాత్రి 11:24 గంటలకు మూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఒక రైఫిల్, ఒక హ్యాండ్‌గన్ ఉన్నట్లు జిల్లా అటార్నీ స్కాట్ కొలమ్ తెలిపారు. ఆయుధాలు ఎక్కడ నుంచి వచ్చాయన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. మూర్ ప్రస్తుతం క్లే కౌంటీ జైలులో బెయిల్ లేకుండా రిమాండ్‌లో ఉన్నాడు. సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ కేసులో క్యాపిటల్ మర్డర్ ఆరోపణలు నమోదు చేసి మరణశిక్ష కోరనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో క్లే కౌంటీ మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.




## మదురో కస్టడీవేళ ..ముక్కు నుంచి రక్తం , వాంతులు..

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం నిర్బంధించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్'లో అత్యంత శక్తివంతమైన, రహస్య ఆయుధాన్ని ప్రయోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మదురో కస్టడీ వేళ అమెరికా డెల్టా ఫోర్స్ ప్రయోగించిన భయంకరమైన ధ్వని తరంగాల దాటికి వెనెజువెలా సైనికులు ముక్కుల నుంచి రక్తస్రావంతో, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురైయారని మదురోకు అత్యంత సన్నిహితంగా పనిచేసిన సెక్యూరిటీ గార్డ్ వెల్లడించాడు. సెక్యూరిటీ గార్డ్ తెలిపిన వివరాలను న్యూయార్క్ పోస్ట్ ప్రచురించింది. గార్డ్ చెప్పిన మాటలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ ఈ విషయాన్ని షేర్ చేశారు. ''మేం మదురోకు రక్షణగా విధుల్లో ఉన్నాం. అకస్మాత్తుగా మా రాడార్ వ్యవస్థలు పూర్తిగా పనిచేయకుండా పోయాయి. ఏమి జరుగుతోందో అర్థమయ్యేలోపే డ్రోన్ల దండు మా పరిధిలోకి వచ్చింది. వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు. కొద్ది సేపటికే 20 మంది సైనికులతో ఎనిమిది హెలికాప్టర్లు అక్కడికి చేరాయి. సంఖ్య తక్కువే అయినా, వారు క్షణాల్లోనే మొత్తం ప్రాంతాన్ని తమ నియంత్రణలోకి తీసుకున్నారు'' అని ఆ గార్డు తెలిపాడు. అమెరికా దళాలు ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పోరాట పద్ధతులను ఉపయోగించాయని, సాంకేతికంగా ఎంతో ముందున్నాయని అతడు పేర్కొన్నాడు. ''మేం వందల సంఖ్యలో ఉన్నా ప్రయోజనం లేకపోయింది. అమెరికా శక్తి ముందు వెనెజువెలా సైన్యం తేలిపోయింది'' అని వ్యాఖ్యానించాడు. అత్యంత కలవరపెట్టే మరో అంశం ''ఒక దశలో వారు ఏదో ప్రయోగించారు. అది తీవ్రమైన ధ్వని తరంగంలా అనిపించింది. నా తల లోపలినుంచి పేలిపోతున్నట్లైంది. వెంటనే మా ముక్కుల నుంచి రక్తం కారింది. కొందరు వాంతులు చేసుకున్నారు. ఇంకొందరు నేలపై కుప్పకూలిపోయారు. ఆ ఆయుధం ముందు నిలబడలేకపోయాం'' అని అతడు వివరించాడు. ఈ వ్యాఖ్యలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కూడా సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు సమాచారం. ఈ ఆరోపణలపై స్పందించిన అమెరికా నిఘా విభాగానికి చెందిన ఓ మాజీ అధికారి.. మైక్రోవేవ్‌లు, లేజర్ ఆధారిత ఆయుధాలను ఉపయోగించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఆయుధాల వల్ల రక్తస్రావం, నొప్పి, మంట, నిస్సత్తువ వంటి ప్రభావాలు కనిపిస్తాయని తెలిపారు. గతంలో గల్వాన్ ఘర్షణలో చైనా మైక్రోవేవ్ ఆయుధాలు వాడిందన్న ఆరోపణల్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు మదురో ఘటన కొత్త వివాదానికి తెరలేపిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
12.01.2026
www.manasarkar.com



# రేనాటి వీరుడికి వైఎస్ జగన్ నివాళి

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఓబన్న వీరత్వాన్ని స్మరించుకుంటూ ఆసక్తికర ట్వీట్ చేశారు. తెలుగు నేల గర్వపడే పోరాట యోధుడు, స్నేహానికి నిలువెత్తు నిదర్శనమైన ఓబన్న.. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైన్యాధిపతిగా ఉంటూ బ్రిటిష్ సామ్రాజ్యానికే సవాల్ విసిరారని కొనియాడారు. ఓబన్న చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని జగన్ పేర్కొన్నారు. అదేవిధంగా తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను పార్టీ నేతలు అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రేనాటి గడ్డపై పుట్టి బ్రిటీష్ వారి గుండెల్లో నిద్రపోయిన వీరుడు ఓబన్న అని, ఆయన చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. సామాన్యుడి పోరాట పటిమకు ఓబన్న ఒక గొప్ప ప్రతీక అని వారు స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మూర్తితో పాటు పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల నుంచి వచ్చి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఓబన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించి, ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు.

# ఆర్యవైశ్యులను వేధిస్తే సహించేది లేదు

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్యవైశ్యులే లక్ష్యంగా దాడులు పెరగడంపై మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్యవైశ్యులపై పోలీసులు భౌతిక దాడులకు పాల్పడుతుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. పోలీసుల వేధింపులపై తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యులే ఏకమై ఈ కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని ఆయన హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట వేసి, అనేక పథకాల ద్వారా వారికి ఎంతో మేలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై వెల్లంపల్లి విమర్శలు గుప్పిస్తూ, కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అన్నదాతల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని, పంటలకు కనీస గిట్టుబాటు ధర లభించక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, సామాన్య ప్రజల నుంచి వ్యాపారవేత్తల వరకు అందరూ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి, కేవలం రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే ఈ ప్రభుత్వం ఏకైక అజెండాగా పెట్టుకుందని వెల్లంపల్లి ధ్వజమెత్తారు. ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పోలీసులు ప్రవర్తించడం సహించరానిదని, బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, దాడులతో ప్రతిపక్షాన్ని అణిచివేయాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను త్వరలోనే ఎండగడతామని ఆయన హెచ్చరించారు.



# తాడికొండలో ఘోర ప్రమాదం

## కారు టైరు పంక్చరై ఇద్దరు యువకుల మృతి!

**తాడికొండ (ఏడీఎన్ఎన్) :**

సంక్రాంతి సంబరాల్లో ఉండాల్సిన ఇళ్లలో విషాద ఛాయలు అలముకున్నాయి. కారు టైరు పంక్చర్ కావడంతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామం శివారులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. తుళ్లూరుకు చెందిన అఖిల్, తరుణ్ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం కారులో బయలుదేరారు. తాడికొండ మండలం లాం గ్రామం సమీపానికి చేరుకోగానే, వీరు ప్రయాణిస్తున్న కారు టైరు ఒక్కసారిగా పంక్చర్ అయ్యింది. అతివేగంగా ఉన్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. చెట్టును ఢీకొట్టిన ధాటికి కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో అఖిల్, తరుణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న మరో ముగ్గురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న తాడికొండ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పండుగ పూట తమ బిడ్డలు మరణించారన్న వార్త తెలియడంతో తుళ్లూరులో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విశాఖ పోలీసుల వేగం.. బాధితురాలి మానవత్వం

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**



విశాఖపట్నంలోని జగదాంబ సెంటర్ వద్ద యువతిపై జరిగిన దాడి కేసును విశాఖ పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి, ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేకపోయినా సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించారు. అయితే, నిందితుడిని చూసిన బాధితురాలు పెద్ద మనసుతో వ్యవహరించడం విశేషం. ఆ వ్యక్తి మానసిక స్థితి సరిగా లేదని గుర్తించిన ఆమె, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని, బదులుగా మానసిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని పోలీసులను కోరారు. బాధితురాలి ఉదారతపై పోలీసులు మరియు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ విశాఖ పోలీసులను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు, ముఖ్యంగా మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో విశాఖపట్నం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కొనియాడారు. భవిష్యత్తులో ఇటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. నిందితుడి వివరాలు తెలియకపోయినా కేసును వేగంగా ఛేదించడం పోలీస్ యంత్రాంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలను సాకుగా చూపి రాజకీయం చేసేవారిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వంపై బురద జల్లాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం నగర ప్రతిష్టను మంటగలిపేవారిని ఉపేక్షించవద్దని ఆయన ఆదేశించారు. రెండు రోజుల క్రితం విజయ దుర్గ అనే యువతిపై జగదాంబ సెంటర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి దుర్భాషలాడటంతో ఆమె సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వేగవంతమైన స్పందనపై బాధితురాలు సంతృప్తి వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం పోలీసుల పనితీరుకు మరియు బాధితురాలి మానవీయ కోణానికి అద్దం పట్టింది.

## ఆత్రేయపురంలో సంక్రాంతి ఉత్సాహం

# ఈత పోటీల్లో యువత జోరు!

**రావులపాలెం (ఏడీఎన్ఎన్) :**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో ఆదివారం వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 'ఆత్రేయపురం ఉత్సవ్2026'లో భాగంగా ఏర్పాటు చేసిన ఈత పోటీలు , ఫుడ్ ఫెస్టివల్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని పొడపాటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజస్విని పొడపాటి మాట్లాడుతూ ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆకాంక్షించారు. కోనసీమ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున గ్రామీణ క్రీడలను, కళలను ప్రోత్సహించడం అభినందనీయమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆత్రేయపురం కాల్వలో నిర్వహించిన ఈత పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు 200 మందికి పైగా ఈతగాళ్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోగా, వారిని ఉత్సాహపరిచేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో గోదావరి తీరం జనసందోహంగా మారి పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ పోటీల నిర్వహణలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. గ్రామీణ క్రీడలకు పునర్వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా స్థానిక లోళ్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో కోనసీమ రుచులు నోరూరించాయి. ముఖ్యంగా ఆత్రేయపురం ప్రపంచ



ప్రసిద్ధి గాంచిన పూతరేకులు, వివిధ రకాల పిండివంటల స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి. డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ స్టాళ్ల ద్వారా స్థానిక ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సంప్రదాయ రుచులతో పాటు గ్రామీణ వినోదాన్ని మేళవించి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు కోనసీమ వైభవాన్ని చాటిచెబుతున్నాయని పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సామాన్యుడిని దోచుకుంటున్న థియేటర్లు




**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

సినిమా టికెట్ ధరల పెంపు థియేటర్లలో తినుబండారాల అధిక ధరలపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో కొత్త సినిమాల విడుదల సందర్భంగా టికెట్ ధరలను భారీగా పెంచుకోవడానికి ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు. సినిమా పరిశ్రమ అడిగిందే తడవుగా, ప్రజల జేబులకు చిల్లులు పడేలా ప్రభుత్వాలు వ్యవహరించడం దుర్మార్గమని, ఇది ముమ్మాటికీ 'సినిమా మాఫియా' ప్రభుత్వాలు కలిసి చేస్తున్న దోపిడీ అని ఆయన ధ్వజమెత్తారు. వందల కోట్లు ఖర్చు చేసి సినిమాలు తీయమని నిర్మాతలను ఎవరు అడిగారని నారాయణ ప్రశ్నించారు. భారీ బడ్జెట్లతో సినిమాలు తీసి నష్టపోతే, ఆ భారాన్ని సామాన్య ప్రజలపై వేసి దోచుకోవడం ఏంటని ఆయన నిలదీశారు. ఇతర వ్యాపారాలు చేసే వారికి నష్టాలు వస్తే ప్రభుత్వం ఆదుకోదు కానీ, సినిమా వాళ్లకు మాత్రం ఇలా ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రశ్నించారు. సినిమా వాళ్లు సిగ్గులేకుండా అడుగుతుంటే, ప్రభుత్వాలు కూడా విచక్షణ లేకుండా అనుమతులు ఇస్తున్నాయని ఆయన మండిపడ్డారు. థియేటర్లలో సామాన్యులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, అక్కడ జరుగుతున్నది బహిరంగ దోపిడీ అని నారాయణ ఆరోపించారు. థియేటర్లకు వెళ్లే ప్రజలను కనీసం వాటర్ బాటిల్ లేదా బిస్కెట్ ప్యాకెట్ కూడా లోపలికి తీసుకువెళ్లనివ్వడం లేదని, లోపల వాటర్ బాటిల్ లేదా స్నాక్స్ కొనాలంటే వందల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినోదం కోసం వచ్చే సామాన్యుడిని అడుగడుగునా లూటీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొత్త సినిమాలు విడుదలైనప్పుడు పది రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసుకునేందుకు ప్రభుత్వాలు ఇస్తున్న జీవోలపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రీమియర్ షో టికెట్ ధరలు వెయ్యి రూపాయలకు పైగా వసూలు చేయడం ద్వారా సామాన్యుడికి వినోదాన్ని దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు తక్షణమే ఈ టికెట్ ధరల పెంపును అరికట్టాలని, థియేటర్లలో వసూలు చేస్తున్న అడ్డగోలు ధరలపై కఠినమైన నియంత్రణ తీసుకురావాలని నారాయణ డిమాండ్ చేశారు.

# అన్నను రాయితో కొట్టి చంపిన చెల్లెలు!

**అనకాపల్లి (ఏడీఎన్ఎన్) :**

మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. రక్త సంబంధీకుల మధ్య ఆస్తుల చిచ్చు ప్రాణాలు తీసే స్థాయికి చేరుతోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామంలో ఇంటి స్థలం కోసం జరిగిన గొడవలో సొంత అన్ననే చెల్లెలు అంతం చేసిన ఘోర కలికలం రేపింది. పూడిమడక గ్రామానికి చెందిన నూకరాజు, కోర్లమ్మ వరుసకు అన్నచెల్లెళ్లు. వీరి మధ్య కొంతకాలంగా ఇంటి స్థలానికి సంబంధించిన ఆస్తి వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇద్దరి మధ్య మరోసారి తీవ్రస్థాయిలో ఘర్షణ మొదలైంది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన కోర్లమ్మ,



పక్కనే ఉన్న పెద్ద రాయితో అన్న నూకరాజు తలపై బలంగా కొట్టింది. రాయి తలకు బలంగా తగలడంతో నూకరాజు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు , బంధువులు ఆయన్ను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధృవీకరించారు. నిన్నటి వరకు కలిసున్న అన్నను కళ్ల ముందే విగతజీవిగా చూడటంతో కుటుంబంలో పెను విషాదం నెలకొంది. ఈ ఘటనపై మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలు కోర్లమ్మను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆస్తి గొడవలే ఈ హత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

# మహిళలపై దాడి చేసిన వారిపై చర్యలేవి?

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలు వెలకట్టలేనివని, అయితే గత ప్రభుత్వ హయాంలో రైతులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొన్న వేధింపుల పట్ల బాధ్యులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. మందడం గ్రామంలో ఆదివారం జరిగిన రైతు సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల కాలంలో అమరావతి ఉద్యమ సమయంలో మహిళలు ఎన్నో అవమానాలను, శారీరక వేధింపులను అనుభవించారని ఏబీ వెంకటేశ్వర రావు గుర్తు చేశారు. "మహిళలపై దాడులు జరిగినప్పుడు యావత్ రాష్ట్రం స్పందించింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా, ఆనాడు మహిళలపై దాడులకు తెగబడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?," అని ఆయన ప్రశ్నించారు. బాధ్యులను శిక్షించినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చేపట్టబోయే రెండో విడత భూసేకరణపై ఆయన రైతులకు అత్యంత కీలకమైన సూచనలు చేశారు. భూములు ఇచ్చే ముందు ప్రభుత్వం ప్రకటించే ప్యాకేజీలు, నిబంధనలను రైతులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కోరారు. ప్లాట్ల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన భవిష్యత్తులో అందే ప్రయోజనాలపై పూర్తి స్థాయిలో రాతపూర్వక స్పష్టత వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు. రాజధాని అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, ఇది ఐదు కోట్ల ప్రజల ఆశ అని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు



సమానంగా అందాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో మందడం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజధాని నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను, తమకు రావాల్సిన బకాయిలను ఏబీ వెంకటేశ్వర రావు దృష్టికి తీసుకువచ్చారు. ఐపీఎస్ అధికారిగా సుదీర్ఘ అనుభవం ఉన్న ఏబీ, రైతుల పక్షాన నిలబడి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది.



# కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది

**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలపై తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కేవలం రాజకీయ వేధింపులకే ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ వేధింపులను తాను కూడా ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్నానని, అయితే ఇలాంటి బెదిరింపులకు తాము లొంగిపోయే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మిధున్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్ళీ వైసీపీ జయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల రక్షణకు పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం మిధున్‌రెడ్డి ఈ సందర్భంగా కీలక ప్రకటనలు చేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు త్వరలోనే ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడంతో పాటు,అధికారిక గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు వైసీపీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.



# నేతన్నలకు 'సంక్రాంతి' కానుక

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

చేనేత సహకార సంఘాల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పండుగ వేళ నేతన్నల ఇళ్లలో వెలుగులు నింపేలా ₹5 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆప్కో యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నిధులు నేరుగా సహకార సంఘాల ఖాతాల్లో జమకానున్నాయి. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సవిత ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. గత డిసెంబర్ నెలలోనే చేనేత సహకార సంఘాలకు ₹2.42 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. తాజాగా సంక్రాంతి పండుగ ఖర్చుల దృష్ట్యా, నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు మరో ₹5 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. గత విడత బకాయిలను కూడా ప్రాధాన్యత క్రమంలో త్వరలోనే పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు, నేతన్నలు ఎవరిపైనా ఆధారపడకుండా ఏడాది పొడవునా ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మంచి ధర కల్పించేందుకు కోఆప్టెక్స్, టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత వస్త్రాలను ఆన్‌లైన్‌లో విక్రయించేలా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియో మార్ట్, ఓఎన్డీసీ వంటి దిగ్గజ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానం చేశారు. దీనివల్ల నేతన్నల ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్నాయని మంత్రి సవిత వెల్లడించారు. వినియోగదారులను ప్రోత్సహించేందుకు ఆప్కో షోరూమ్‌లలో సంక్రాంతి వరకు 30 నుంచి 40 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మంగళగిరి వంటి ప్రత్యేక కేంద్రాల్లో ఈ రాయితీ 60 శాతం వరకు కూడా ఉందని ఆమె పేర్కొన్నారు.



# పవన్ కల్యాణ్ పైన ఫైర్.. చిరంజీవికి ఆల్ ది బెస్ట్!

**గుంటూరు (ఏడీఎన్ఎన్) :**

మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సోమవారం సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుతూ రాజకీయ, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే, వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన ట్వీట్ ఇప్పుడు పొలిటికల్ , సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అంబటి రాంబాబు తన 'ఎక్స్' ఖాతాలో చిరంజీవితో దిగిన ఒక అరుదైన పాత ఫోటోను పంచుకుంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. "నా అభిమాన నటుడు చిరంజీవి గారు నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా సూపర్ డూపర్ హిట్ అవ్వాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను," అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్‌ను తీవ్రంగా వ్యతిరేకించే అంబటి, అన్న చిరంజీవి విషయంలో మాత్రం తనకున్న వ్యక్తిగత అభిమానాన్ని మరోసారి బయటపెట్టారు. రాజకీయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అంబటి రాంబాబు అనేక సందర్భాల్లో ఘాటు విమర్శలు చేశారు. అయితే, అన్న చిరంజీవిని మాత్రం ఎప్పుడూ 'తమ వాడే' అని సంబోధిస్తూ, ఆయనపై పొగడ్తల వర్షం కురిపిస్తుంటారు. చిరంజీవి చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను అంబటి గతంలో పలుమార్లు ప్రశంసించారు. చిరంజీవి అసలు పేరు 'శంకర వరప్రసాద్' పేరుతోనే ఈ సినిమా రావడం, అది మెగాస్టార్ కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రంగా ఉండబోతుండటంతో అంబటి వంటి రాజకీయ ప్రత్యర్థులు కూడా సినిమాకు మద్దతు తెలపడం విశేషం. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పాత్రలో ఉండగా, ప్రతిపక్ష వైసీపీ నేత అంబటి రాంబాబు ఇలా చిరంజీవి సినిమాను ప్రమోట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇది కేవలం చిరంజీవిపై ఉన్న అభిమానమా లేక పవన్ కల్యాణ్‌ను ఇబ్బంది పెట్టే రాజకీయ వ్యూహమా అని నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా, మెగాస్టార్ సినిమా విడుదలకు ముందు ఒక కీలక రాజకీయ నేత నుంచి ఇలాంటి స్పందన రావడం సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది.



## పట్టణాలకు అదనపు తహశీల్దార్లు

**మంత్రి పొంగులేటి సంచలన ప్రకటన**

పెద్దపల్లి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలోని అధిక జనాభా కలిగిన పట్టణ ప్రాంతాల్లో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు త్వరలోనే అదనపు తహశీల్దార్లను కేటాయించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. పెద్దపల్లి జిల్లాలో ఆదివారం పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 1.5 లక్షల నుంచి 2 లక్షల జనాభా ఉన్న పట్టణాలు అనేకం ఉన్నాయని , ఇంత భారీ జనాభాకు ఒకరే తహశీల్దార్ ఉండటం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమని పొంగులేటి తెలిపారు . ఈ సమస్యను పరిష్కరించేందుకు అదనపు అధికారుల నియామకంపై త్వరలోనే కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందని భరోసా ఇచ్చారు. రాజకీయ విమర్శలు చేస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరుస ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా, మున్సిపల్ ఎన్నికలను సెమీఫైనల్ అనడం కేటీఆర్ పగటి కలలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. "సొంత ఇంటి ఆడబిడ్డకే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారు?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను నిర్మించిందని, పేదలకు ఇళ్లు ఇచ్చే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి ప్రజాహిత కార్యక్రమాలతో ముందుకెళ్తోందని, అందుకే ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



## వీబీ జీ రామ్‌జీ తోనే పారదర్శకత

**రాష్ట్రాలు నిధులిస్తే తప్పేంటి?**

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్‌జీ పథకంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వీబీజీ రామ్‌జీ చట్టంపై వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని, అందులో భాగంగానే అవినీతిని అరికట్టి పారదర్శకతను పెంచేందుకు వీబీజీ రామ్‌జీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ చట్టం బీజేపీ స్వప్నమని, దీని ద్వారా సామాన్యులకు మేలు జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పథకం అమలులో రాష్ట్రాల భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా ఒక పథకంలో రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పుడే బాధ్యత పెరుగుతుందని, వీబీజీ రామ్‌జీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తే తప్పేముందని ప్రశ్నించారు. ఈ నిధుల కేటాయింపు ద్వారా క్షేత్రస్థాయిలో పథకం మరింత పటిష్టంగా అమలు కావడానికి ఆస్కారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ప్రధాని మోదీకి ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తోందని, ప్రతి అభివృద్ధి పథకాన్ని అడ్డుకోవడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని రామచందర్‌రావు మండిపడ్డారు. అవినీతికి పాల్పడే అవకాశం ఉండదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు ఈ కొత్త చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణల వల్ల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని, దీనిని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ శ్రేణులంతా గ్రామగ్రామాన పర్యటించి, వీబీజీ రామ్‌జీ చట్టం యొక్క విశిష్టతను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టి, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



## సీఎం ఒక విప్లవకారుడు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సామాజిక వైద్యుడని, అట్టడుగు వర్గాలకు న్యాయం చేస్తున్న గొప్ప 'సామాజిక విప్లవకారుడు' అని నాగర్ కర్నూలు ఎంపీ, కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ మల్లు రవి కొనియాడారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, పాలనా విధానాలపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం సామాజిక న్యాయం అమలవుతోందని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటి గడప తడుతున్నాయని మల్లు రవి పేర్కొన్నారు. ప్రజలంతా ప్రస్తుత పాలనలో అత్యంత సంతోషంగా ఉన్నారని, రేవంత్ రెడ్డి గారి నాయకత్వం రాష్ట్రానికి శ్రీరామరక్ష అని చెబుతూ.. ఆయన పాలన వందేళ్ల పాటు సాగాలని ఆకాంక్షించారు.రాష్ట్ర రాజకీయాలపై విశ్లేషిస్తూ.. తెలంగాణలో బీఆర్ఎస్ అధ్యాయం ముగిసిందని మల్లు రవి విమర్శించారు. "అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మరియు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ప్రజలు ఆ పార్టీని పూర్తిగా విస్మరించారు" అని అన్నారు. బీజేపీపై కూడా ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ, తెలంగాణ అభివృద్ధికి నయాపైసా నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీని నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరని, రాష్ట్రంలో ఆ పార్టీకి భవిష్యత్తు లేదని స్పష్టం చేశారు.

## ప్రాణాలు తీస్తున్న చైనా దారం

**మృత్యుపాశంగా మారిన 'మాంజా'**

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఆకాశం గాలిపటాలతో రంగురంగులమయంగా మారుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతో ఉత్సాహంగా పతంగులు ఎగురవేస్తూ పోటీ పడుతుంటారు. అయితే, ఈ సరదా ఆట వెనుక ఒక ప్రాణాంతకమైన ప్రమాదం పొంచి ఉంది. కొందరు వ్యాపారులు , పతంగుల ప్రేమికులు ఉపయోగిస్తున్న 'చైనా మాంజా' అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. తాజాగా ఆదివారం ఒక్కరోజే హైదరాబాద్ , పరిసర ప్రాంతాల్లో చైనా మాంజా తగిలి ముగ్గురు వ్యక్తులు మృత్యువు అంచులకు వెళ్లి ప్రాణాలతో బయటపడ్డారు. ఉప్పల్ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో సాయివర్ధన్ రెడ్డి అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా గాలిలో వేలాడుతున్న చైనా మాంజా అనుకోకుండా అతడి గొంతుకు చుట్టుకుంది. దారం పదునుగా ఉండటంతో ఒక్కసారిగా గొంతు కోసుకుపోయింది. తీవ్ర రక్తస్రావంతో విలవిలలాడుతున్న అతడిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, కొద్దిపాటి తేడాతో పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరో దిగ్భ్రాంతికర ఘటన గచ్చిబౌలిహఫీజ్‌పేట రహదారిపై చోటుచేసుకుంది. చైతన్య అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, గాలిలో కట్ అయి వస్తున్న చైనా మాంజా అతడి మెడకు చుట్టుకుంది. దాని నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తన చేతిని అడ్డుపెట్టగా, మాంజా పదునుకు అతడి చేయి లోతుగా కోసుకుపోయింది. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయిన చైతన్యను స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. నల్గొండ జిల్లా తిరుమలగిరికి చెందిన సభావత్ మధు హైదరాబాద్ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా సాగర్ హైవేపై ప్రమాదానికి గురయ్యాడు. మాల్ మార్కెట్ వద్ద ఒక విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న చైనా మాంజా అతడి చేతి వేళ్లకు బలంగా తగలడంతో వేళ్లు తీవ్రంగా తెగిపోయాయి. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల హెచ్చరిక ఆన్‌లైన్ విక్రయాలపై నిఘా: తెలంగాణ ప్రభుత్వం 2016లోనే చైనా మాంజాను నిషేధించినప్పటికీ, రహస్యంగా సాగుతున్న విక్రయాలు ఇప్పుడు ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నాయి. ఈ ప్రమాదాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందిస్తూ.. నిషేధిత మాంజా విక్రయించే వారిపై కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వ్యాపారులు ఇప్పుడు ఈకామర్స్ సైట్లు, సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ ద్వారా మాంజా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వెబ్‌సైట్లపై 24 గంటల నిఘా ఉంచామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పత్తి దారంతో చేసిన దారాలనే కొనివ్వాలని, పక్షులు మరియు మనుషుల ప్రాణాలకు హాని కలిగించే సింథటిక్ దారాలను వాడొద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ల్యాండ్ మాఫియాను వదిలిపెట్టం

- ఏకశిలా వెంచర్ బాధితులకు అండగా ఈటల
- రియల్ మాఫియాకు కొమ్ముకాస్తున్న అధికారులపై ఆగ్రహం
- 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్
- ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరిక

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఏకశిలా వెంచర్ భూ వివాదంలో రియల్ మాఫియా గుండాలు సామాన్య ప్రజలపై కత్తులు, కర్రలతో దాడులకు తెగబడటంపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన ఏకశిలా వెంచర్‌ను ఆదివారం సందర్శించి, దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై , ల్యాండ్ మాఫియాపై ఆయన నిప్పులు చెరిగారు. 1985లో సామాన్య ఉద్యోగులు, కూలీలు కొనుక్కున్న ప్లాట్లను రెవెన్యూ రికార్డుల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని వెంకటేష్ అనే వ్యక్తి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఈటల ఆరోపించారు. గత ఏడాది తాను స్వయంగా వచ్చి అధికారులతో మాట్లాడినా, మళ్లీ సర్వే పేరుతో ఇక్కడికి రావడం వెనుక ఎవరి ఎంగిలి మెతుకులకు ఆశపడ్డారని అధికారులను ప్రశ్నించారు. మాఫియాకు మద్దతు తెలుపుతున్న ఘట్ కేసర్ ఇన్‌స్పెక్టర్ మరియు రెవెన్యూ



అధికారులపై డీజీపీ, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వాన్ని గుండాలు, ల్యాండ్ గ్రాబర్లు నడుపుతున్నారా?" అని ఈటల ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, పోలీసులు చట్టాన్ని కాపాడాల్సింది పోయి గుండాలకు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కబ్జాల వెనుక కాంగ్రెస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేల హస్తం ఉందని, సీఎం రేవంత్ రెడ్డి దీనిపై తక్షణమే స్పందించాలని కోరారు. దాడులకు పాల్పడిన వెంకటేశ్వరరావు మరియు అతని గుండాలను 24 గంటల్లో అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని, లేనిపక్షంలో బీజేపీ తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈటల హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని, ఏకశిలా నగర్ నివాసితులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

## తలసేమియా రహిత రాష్ట్రంగా తెలంగాణ

- త్వరలో ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో డే కేర్ సెంటర్లు
- తలసేమియా, సికిల్‌సెల్ బాధితులందరికీ 'పెన్షన్' హామీ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణను దేశంలోనే మొట్టమొదటి తలసేమియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. హైదరాబాద్‌లోని కమల హాస్పిటల్‌లో 'తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ' ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఏసియన్ తలసేమియా కాన్‌క్లేవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రక్త సంబంధీకుల మధ్య వివాహాల వల్ల పిల్లలకు ఈ జన్యుపరమైన వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు స్క్రీనింగ్, కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే వీటిని అరికట్టవచ్చని, సామాజిక అవగాహన కల్పించడమే ఈ వ్యాధులకు సరైన విరుగుడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి ఈ సందర్భంగా వివరించారు.



ఇప్పటికే ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మంలలో డే కేర్ సెంటర్లు ఉండగా, త్వరలో ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో అదనపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు 11 లక్షల మందికి పైగా సికిల్‌సెల్ స్క్రీనింగ్ పూర్తి చేశామని మంత్రి తెలిపారు ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందిస్తున్నామని, టీడయాగ్నోస్టిక్స్ ద్వారా అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని మంత్రి వివరించారు. నివారించగలిగే వ్యాధులతో ఏ చిన్నారి పుట్టకూడదన్నదే తమ ఆశయమని మంత్రి తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా బాధితులందరికీ ప్రభుత్వం తరపున 'పెన్షన్' అందేలా చర్యలు తీసుకుంటామని సంచలన హామీ ఇచ్చారు. మిషన్ 'తలసేమియా ఫ్రీ తెలంగాణ' సాధనకు వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇంకా మిగిలి ఉన్న మూడేళ్ల కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి మంచి పనులు చేయాలని సీఎం రేవంత్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరిన సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగి ప్రజల ఆస్తులకు విలువ వచ్చిందని, కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రియల్ ఎస్టేట్‌ను తొక్కిపెట్టారని కేటీఆర్ విమర్శించారు. అప్పట్లో రూ. 5 లక్షలు ఉన్న భూమి రూ. 50 లక్షలకు చేరితే, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో రేట్లు పడిపోయి ప్రజల ఆస్తులు కళ్లముందే కరిగిపోతున్నాయని , ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దేవుళ్లు, సోనియా గాంధీపై ఒట్టు వేసి ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని అడిగితే సీఎం బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. లాగుల్లో తొండలు విడుస్తా, పేగులు తీసి మెడలో వేసుకుంటా అనడం తప్ప రేవంత్ రెడ్డికి మరో భాష తెలియదని ఎద్దేవా చేశారు. రైతుల సంపదను పెంచిన రైతుబంధును అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పులపై కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరు ఒక రకమైన అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాగ్ లెక్కల ప్రకారం బీఆర్ఎస్ చేసిన అప్పు రూ. 2.80 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ కాంగ్రెస్ నేతలు రూ. 8 లక్షల కోట్ల వరకు చెప్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో కేవలం పేదల ఇళ్లను కూలగొడుతున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లు ప్రభుత్వానికి కనిపించడం లేదని విమర్శించారు. నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలంటూ అబద్ధాలు చెప్తున్నారని, కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు అందిస్తూ రేవంత్ రెడ్డి ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎంకు ఏమీ తెలియదని, ఎవరైనా చెబితే వినే రకం కాదని కేటీఆర్ దుయ్యబట్టారు.

## మేడారానికి పోటెత్తిన భక్తజనం

ములుగు (ఏడీఎన్ఎన్) :

మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర ప్రారంభానికి ముందే వనదేవతల సన్నిధి భక్తులతో కిటకిటలాడుతోంది. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలి వస్తున్నారు. జాతర సమయంలో ఉండే విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు ముందుగానే వచ్చి అమ్మవార్లకు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో మేడారానికి భక్తులు పోటెత్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, సమ్మక్కసారలమ్మ గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల తాకిడి పెరగడంతో పస్రామేడారం మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా



సంక్రాంతి సెలవులతో వనదేవతల సన్నిధిలో భారీ రద్దీ

ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జంపన్న వాగు వద్ద తప్పిపోయిన ఒక చిన్నారిని మంత్రి సీతక్క స్వయంగా ఓదార్చి, పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా తల్లిదండ్రులకు అప్పగించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

## రామగుండం అభివృద్ధికి రూ. 600 కోట్లు



రామగుండం, (ఏడీఎన్ఎన్) :

రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా రూ. 600 కోట్ల నిధులతో భారీ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. రామగుండంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సభను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని , గత ప్రభుత్వం ప్రజలను విస్మరిస్తే, ఈ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. సామాజిక సమానత్వంలో భాగంగా దేశంలోనే తొలిసారిగా 50 మంది ట్రాన్స్ జెండర్లకు మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, ఇది దేశానికే ఆదర్శమన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని భట్టి తెలిపారు. రూ. 600 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వైద్య, విద్యా రంగాల్లో సమగ్ర మార్పులు రాబోతున్నాయని, ఈ పనులు రామగుండం రూపురేఖలను మార్చివేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.



## స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

- ఎంపీ రఘునందన్ రావు ఆదేశాలు
- పార్టీ బలోపేతానికి యువత నడుం బిగించాలని పిలుపు

కుకునూర్ పల్లి (ఏడీఎన్ఎన్) :

రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమరోత్సాహంతో ముందుకు సాగాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. కుకునూర్ పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ సమక్షంలో పార్టీలో ఆదివారం చేరారు. వారికి ఎంపీ కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. యువత ఉత్సాహంతో పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరీ శంకర్ ముదిరాజు, ముఖ్య నాయకులు మలిపెద్ది రమేష్, రాగం రమేష్ యాదవ్, ఆత్మూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే ఊరుకోం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

డీలిమిటేషన్ పేరుతో చారిత్రాత్మక సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే సహించేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సికింద్రాబాద్‌లోని బాలంరాయ్ ప్యాలెస్‌లో 'లష్కర్ జిల్లా సాధన సమితి' ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కీలక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాలసాని మాట్లాడుతూ.. గ్రేటర్ సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు, సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. "సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధం. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాను" అని ఆయన ప్రకటించారు. డీలిమిటేషన్ ప్రక్రియలో 150 డివిజన్లను 300 చేయాలనుకున్నప్పుడు ప్రజల, ప్రజాప్రతినిధుల సలహాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ గ్లోబల్ సిటీగా వెలుగొందితే, గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలతో ఆడుకుంటోందని, అభివృద్ధిని విస్మరించి రాజకీయ కుతంత్రాలకు పాల్పడుతోందని విమర్శించారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
12.01.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**12-01-2026 సోమవారం**

**మేషం:**
ముఖ్యమైన వ్యవహారాలన్నీ పూర్తవుతాయి. గృహ, వాహన ప్రయత్నాలు చాలావరకు ఫలిస్తాయి. బ్యాంక్ బ్యాలెన్స్ బాగా వృద్ధి చెందుతుంది. ఆర్థిక అవసరాలు తీరిపోవడంతో పాటు ఆర్థిక సమస్యలు పరిష్కారమవుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆస్తి వివాదాల పరిష్కారానికి సమయం అనుకూలంగా ఉంది. ఉద్యోగంలో జీతభత్యాలకు సంబంధించిన శుభ వార్తలు వింటారు.

**వృషభం:**
అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. బంధుమిత్రుల నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాల్లో మార్పులు చేసి లబ్ధి పొందుతారు. నిరుద్యోగులకు కొత్త ఆపర్లు అందుతాయి. ఉద్యోగంలో అనుకూల వాతావరణం నెలకొంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో కార్య సిద్ధి కలుగుతుంది. అప్రయత్న ధన లాభానికి అవకాశం ఉంది.

**మిధునం:**
ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. అన్ని రంగాల వారికి సమయం అనుకూలంగా ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో ఆశించిన ప్రోత్సాహకాలు అందుతాయి. అధికారుల నుంచి ఆదరణ పెరుగుతుంది. వ్యాపారాల్లో రాబడి బాగా వృద్ధి చెందుతుంది. తోబుట్టువులతో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగం మారడానికి అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు ఆశించిన ఆఫర్లు అంది వస్తాయి. ఆర్థిక స్థిరత్వం చోటు చేసుకుంటుంది.

**కర్కాటకం:**
ఉద్యోగంలో కొద్దిగా ఓర్పు, సహనాలతో వ్యవహరించడం మంచిది. వ్యాపారాల్లో శ్రమాధిక్యత ఉన్నా ఫలితం ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు బిజీగా సాగుతాయి. ఎటువంటి ప్రయత్నమైనా సానుకూల ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలు తప్పకుండా సఫలం అవుతాయి. నిరుద్యోగులకు విదేశాల నుంచి కూడా ఆఫర్లు వచ్చే సూచనలున్నాయి. కుటుంబ జీవితంలో ఒత్తిడి తగ్గుతుంది.

**సింహం:**
ఉద్యోగంలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. వ్యక్తిగత సమస్యల నుంచి బయట పడే అవకాశం ఉంది. డాక్టర్లు, లాయర్లు తదితర వృత్తుల వారికి అవకాశాలు పెరుగుతాయి. బంధుమిత్రులతో విందులు, వినోదాలకు ప్లాన్ చేస్తారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు లభిస్తాయి. సోదర వర్గంతో అనుకోకుండా స్థిరాస్తి వివాదం పరిష్కారం అవుతుంది.

**కన్య:**
వృత్తి, వ్యాపారాలు బాగా బలం పుంజు కుంటాయి. ఉద్యోగంలో సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆశించిన స్థాయిలో ధన లాభాలు కలుగుతాయి. రావలసిన సొమ్మంతా వసూలవుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది. సన్నిహితుల వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది.

**తుల:**
ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. షేర్లు, స్పెక్యులేషన్లు అంచనాలను మించి లాభిస్తాయి. ఉద్యోగంలో ప్రాభవం, గౌరవ మర్యాదలు బాగా పెరుగుతాయి. వృత్తి జీవితంలో కూడా దూసుకుపోతారు. వ్యాపారాలు ఆర్థికంగా బాగా బలం పుంజుకుంటాయి. ఆరోగ్యానికి లోటుండదు. నిరుద్యోగుల ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఉద్యోగం మారే అవకాశం ఉంది. జీవిత భాగస్వామికి ఆర్థిక పురోగతి లభిస్తుంది.

**వృశ్చికం:**
ఆర్థిక సమస్యలు చాలావరకు తగ్గుముఖం పడతాయి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆశించిన శుభవార్తలు వింటారు. ఉద్యోగ జీవితం కూడా ప్రశాంతంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాలు నిలకడగా కొనసాగుతాయి. కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు, పనుల్ని విజయవంతంగా పూర్తి చేస్తారు. అదనపు ఆదాయ ప్రయత్నాలు నెరవేరుతాయి. ఇంటా బయటా అనుకూల వాతావరణం నెలకొంటుంది.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో పదోన్నతులకు, జీతభత్యాల పెరుగుదలకు బాగా అవకాశం ఉంది. వ్యాపారాలు కూడా అంచనాలకు మించి లాభాలు అందిస్తాయి. మరింత మంచి ఉద్యోగంలోకి మారడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు అనుకూలంగా సాగిపోతాయి. ఆర్థిక విషయాలకు సమయం బాగా అనుకూలంగా ఉంటుంది. ముఖ్య మైన ప్రయత్నాలు, వ్యవహారాలు సానుకూలం అవుతాయి.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాల్లో మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు అనుకూలంగా సాగిపోతాయి. లాభదాయకమైన పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగ ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆదాయ ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. మనసులోని కోరికలు చాలావరకు నెరవేరుతాయి. మీ ప్లాన్లు సక్సెస్ అయ్యే అవకాశం ఉంది. ఆస్తి వివాదం ఒకటి పరిష్కార దిశగా సాగుతుంది.


**కుంభం:**
నిదానంగానే అయినా ప్రతి పనీ పూర్తవుతుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభాల పరంగా కొద్దిగా పుంజుకుంటాయి. మీ వ్యూహాలు, ఆలోచనలు సత్ఫలితాలనిస్తాయి. ఉద్యోగాల్లో అధికారులు మీ మీద ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. ప్రముఖులకు సన్నిహితం అవుతారు. కొన్ని ముఖ్యమైన వ్యవ హారాలను పూర్తి చేయడం మంచిది. ఆర్థిక ప్రయత్నాలు ఆశించిన ఫలితాలనిస్తాయి.

**మీనం:**
ఉద్యోగంలో ప్రాధాన్యం, ప్రాభవం బాగా పెరుగుతాయి. అధికారుల నుంచి ఆశించిన ప్రోత్సాహకాలు లభిస్తాయి. వృత్తి జీవితంలో తీరిక ఉండదు. వ్యాపారాలు బాగా కలిసి వస్తాయి. ఏ ప్రయత్నం తల పెట్టినా సఫలమవుతుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేయడం జరుగుతుంది. ముఖ్యమైన పెండింగ్ పనులు పూర్తవుతాయి. అనవసర పరిచయాలకు దూరంగా ఉండాలి.



# మూసీని శుద్ధి చేయరా..?

**వికారాబాద్ (ఏడీఎన్ఎన్):**



మూసీకి జీవం పోస్తామంటూనే.. నదీ జలాలను మురికి మయం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు. నదీ జన్మస్థలమైన వికారాబాద్‌లోనే మూసీ కలుషితమవుతోంది. నేరుగా మురుగునీరు కలుస్తోంది. రూ.లక్షన్నర కోట్లు పెట్టి మూసీని సుందరీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఒకవైపు గాలి కబుర్లు చెబుతున్నారు కానీ.. పాడైపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయించేందుకు ఇప్పటికీ రూపాయి కేటాయించకపోవడం దారుణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. సుందరీకరిస్తామంటూనే మురికిమయం చేస్తున్న రేవంత్ సర్కార్ మూసీనదిలోకి వికారాబాద్ పట్టణంలోని మురుగునీటిని శుద్ధి చేయకుండానే వదులుతుండడంతో దాని పరీవాహక ప్రాంతంలోని రైతులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీలోని ఎస్‌టిపి (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) గత 12 నెలలుగా పనిచేయకపోవడంతో మురుగునీటి శుద్ధి ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వికారాబాద్ మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగు నీరంతా నేరుగా మూసీనదిలో కలుస్తుండడంతో.. దాని పరీవాహక ప్రాంతంలోని రైతులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా జంట జలాశయాల్లోని ఒకటైన ఉస్మాన్‌సాగర్‌లోకి కూడా వికారాబాద్ మున్సిపాలిటీ డ్రైనేజీ నీరు కలుస్తుండడం బాధాకరం. గతంలో కేవలం హైదరాబాద్‌లోనే మురుగునీటితో కలుషితమయ్యే మూసీనది... కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య వైఖరితో మూసీ జన్మస్థలం వద్దే మురుగునీరు కలుస్తుండడంపై స్థానికులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కేంద్రంలో పాడైన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వికారాబాద్‌లో పర్యటించిన సందర్భంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేతో కలిసి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించి, మురుగునీటి శుద్ధి ప్రక్రియ ఎందుకు నిలిచిపోయిందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని మూసీలోకి డ్రైనేజీ నీరు కలుస్తుండడంతో ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. ఏడాదిగా పనిచేయని ఎస్‌టిపి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్‌టిపి (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏడాదిగా పనిచేయడం లేదు. దాని యంత్రాలను బాగు చేసేందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఏడాదిగా ఒక్క రూపాయి విడుదల చేయకపోవడంతో ఎక్కడిక్కడ నిలిచిపోయింది. ఏడాదిగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనిచేయకపోవడంతో ప్రస్తుతం ఎస్‌టిపికి సంబంధించిన యంత్రాలు తుప్పుపట్టే దశకు చేరుకున్నాయి.

# ములుగు జిల్లాలో కారు లారీ ఢీ..

**ములుగు (ఏడీఎన్ఎన్):**



ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. మేడారం వెళ్లే భక్తుల కారును లారీతో పాటు బస్సు ఢీకొనడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ జరిగింది. దీంతో మేడారం వెళ్లే భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్‌చేసే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, మేడారం జాతరకు భక్తులు పోటెత్తారు. వరుస సంక్రాంతి సెలవులు రావడంతో మేడారానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. అమ్మవార్లకు ముందుస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారానికి చేరుకున్న భక్తులు జంపన్న వాగులో ఇరు వైపులా పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దె వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, నిలువెత్తు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో సమ్మక్క దేవత గద్దె వద్ద భక్తజన సందోహం నెలకొంది. భారీగా భక్తులు తరలివస్తుండటంతో పస్రా మేడారం వద్ద వాహనాల రద్దీ నెలకొంది. కాగా, ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తెలంగాణ మంత్రులు మేడారాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకోనున్నారు. అనంతరం జాతర అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు.

# మన సంస్కృతే ఒక సైన్స్




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

హిందూ పండుగలన్నీ ప్రకృతితో మమేకమై ఉంటాయని, వాటి వెనుక గొప్ప విజ్ఞానం దాగి ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ వేదికగా ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు ఉన్న విశిష్టతను కొనియాడారు. ముఖ్యమంత్రి అయినా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైనా, తమ హోదాలను పక్కనపెట్టి పండుగ పూట సొంత ఊళ్లకు వెళ్లి, తమ మూలాలను వెతుక్కునే అద్భుతమైన సంప్రదాయం తెలుగువారి సొంతమని ఆయన ప్రశంసించారు. ఈ గొప్ప సంప్రదాయం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశమంతా విస్తరించాల్సిన అవసరం ఉందని, వృత్తి, ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లిన వారంతా పండుగ రోజుల్లో తమ గ్రామాలకు వెళ్లేలా చూస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని తప్పకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మన పండుగలకు, గ్రామాలకు విడదీయలేని అనుబంధం ఉందని, ఈ సంక్రాంతి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు.

# హైదరాబాద్‌లో రాబోయే రోజుల్లో విద్యుత్ వాడకం ఎక్కువే!

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



హైదరాబాద్ మహానగరం విద్యుత్ వినియోగం, డిమాండ్‌లో రారాజు కానుంది. 2025-26, 2026-27, 2027-28 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని అన్ని మహా నగరాలను దాటేయనుంది. ఈ మేరకు 20వ ఎలక్ట్రిక్ పవర్ సర్వే ఆఫ్ ఇండియా ఫలితాలను కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ) వెలువరించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ 150 డివిజన్లు) ఉన్న ప్రాంతం పరిగణనలోకి తీసుకుని ఈ లెక్కలు వేశారు. దీని ప్రకారం బెంగళూర్, చెన్నయ్, కోల్‌కతా, ముంబైలను హైదరాబాద్ దాటేసింది. 2025 -26లో ముంబై డిమాండ్ 4937 మెగావాట్లు కాగా... అదే హైదరాబాద్ డిమాండ్ 4667 మెగావాట్లు. ఇక 2026-27లో ముంబై డిమాండ్ 5153 మెగావాట్లు కాగా... హైదరాబాద్ డిమాండ్ 5154 మెగావాట్లు. ఇక 2027-28లో ముంబై డిమాండ్ 5396 మెగావాట్లు కాగా... హైదరాబాద్‌లో విద్యుత్ పీక్ లోడ్ 5682 మెగావాట్లుగా ఉంటుందని గుర్తు చేసింది. కాగా, 2025- 26లో హైదరాబాద్ విద్యుత్ అవసరాలకు 28,419 మిలియన్ యూనిట్ల కరెంట్ అవసరం ఉంటుందని లెక్కలు తీయగా... అదే ముంబైలో 27,693 మిలియన్ యూనిట్లుగా ఉంది. ఇక 2026-27లో హైదరాబాద్ విద్యుత్ అవసరాలకు 30,622 మిలియన్ యూనిట్లు అవసరం ఉంటుందని, అదే ముంబైకి ఈ కాలంలో 28,857 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశారు. ఇక 2027- 28లో ముంబైకి 30,200 మిలియన్ యూనిట్లు, హైదరాబాద్‌కు 32,913 మిలియన్ యూనిట్లు కావాల్సి ఉంటుందని గుర్తు చేసింది. ఇక బెంగుళూర్, చెన్నై, కోల్‌కతాలు హైదరాబాద్‌కు దారిదాపుల్లో కూడా లేవు. ఇక విద్యుత్ వినియోగంలో కూడా హైదరాబాద్ టాప్‌గా ఉంది. 2025-26 లో హైదరాబాద్ 25,896 మిలియన్ యూనిట్లుగా ఉండనుందని తెలిపింది. మరోవైపు.. దేశంలో వివిధ కేటగిరీల విద్యుత్ వినియోగం భారీగా పెరగనుందని గణాంకాలు చెబుతున్నాయి.

# కోడి పందేలపై హైకోర్టు ఆదేశాలు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**







సంక్రాంతికి ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేలు నిర్వహించడం అనేక ఏళ్లుగా వస్తోంది. మరోవైపు కోడి పందేల నిర్వహణపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి వేడుకలు అనగానే వెంటనే గుర్తొచ్చేది కోడిపందేలు. ఈ సంప్రదాయం ప్రతి సంవత్సరం అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంది. పొరుగు రాష్ట్రాల నుండి మాత్రమే కాకుండా విదేశాలలో స్థిరపడినవారు కూడా ఈ పోటీలను చూడటానికి పండుగ సమయంలో తమ స్వగ్రామాలకు తిరిగి వస్తారు. కోడిని జాగ్రత్తగా సెలక్ట్ చేసుకోవడం, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం నుండి కఠినమైన ఆహారం, ఫైట్ వరకు.. కోడి జీవితంలోని ప్రతి అంశాన్ని పద్ధతి, ప్లానింగ్ ప్రకారం చూస్తారు. ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు ముఖ్యంగా కోడి పందేలకు ప్రధాన కేంద్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఇది సంక్రాంతి పండుగ సమయం కాబట్టి సాంప్రదాయ గ్రామీణ క్రీడగా ప్రారంభమైంది. కానీ ఇప్పుడు సంక్రాంతి పండుగ రోజుల్లో కోట్ల రూపాయల పందేలతో కూడిన పెద్ద ఎత్తున జూదంగా మారింది. ఇదే అసలు సమస్యగా మారింది. బెస్ట్ ట్రైనర్స్ కోళ్ల యజమానులు మంచి బ్రాండ్ విలువ కలిగిన శిక్షకులను కోరుకుంటారు. గతంలో గెలిచిన కోడిపిల్లలకు శిక్షణ ఇచ్చిన వారిని, శిక్షకులుగా తరతరాలుగా ఉన్న కుటుంబాలకు బాధ్యత అప్పజెబుతారు. కొంతమంది యజమానులు హైదరాబాద్‌లోని బార్కాస్ ప్రాంతం నుండి శిక్షణ పొందిన కోడిపిల్లలను తీసుకువస్తారు. మరికొందరు కోల్‌కతా వంటి ప్రదేశాల నుండి నిపుణులను పిలిపిస్తారు. సాధారణంగా ఒక శిక్షకుడు 10 నుండి 15 కోడి పిల్లలను మాత్రమే పర్యవేక్షిస్తాడు. నెలకు రూ.15,000 నుండి రూ.20,000 వరకు జీతం ఇస్తారని సమాచారం. శిక్షణ సాధారణంగా దసరా నుంచి ప్రారంభమవుతుంది. అయితే కొందరు స్వల్పకాలిక, సంవత్సరం పొడవునా శిక్షణా కార్యక్రమాలు కూడా ఇస్తారు. కోళ్లకు షెడ్యూల్ ఫైటింగ్ కోడి రోజువారి షెడ్యూల్ ఉంటుంది. శిక్షణ ఉదయం 5 గంటల నుండే ప్రారంభమవుతుంది. ఫైట్‌కు 60 రోజుల ముందు వరకు డ్రై ఫ్రూట్స్ లడ్డూలు, హెర్బల్ మిక్స్ లు, వండిన ఆకుకూరలు వంటి ప్రత్యేక ఆహారాలను అందిస్తారు. పోటీకి దాదాపు 40 రోజుల ముందు గుడ్డులోని తెల్లసొనను ఆహారంలో కలుపుతారు. పందెం కోళ్లకు చాలా గంటలు ఆరుబయట వ్యాయామం చేయిస్తారు. సాయంత్రం ధాన్యపు ఆహారం ఇస్తారు. ఎక్కువసేపు విశ్రాంతి ఇస్తారు. భయాన్ని తొలగించడానికి, చురుకుదనాన్ని మెరుగుపరచడానికి చేతితోనే ఆహారం తినిపిస్తారు. అప్పుడప్పుడు ఈత కూడా కొట్టిస్తారు. సంక్రాంతికి ముందు రెస్ట్ సంక్రాంతికి ఒక వారం ముందు మంచి పనితీరు కోసం పూర్తి విశ్రాంతి ఇస్తారు. అలసటను తగ్గించడానికి, బరువును నియంత్రించడానికి, ఇన్ఫెక్షన్లు, ఫంగల్ వ్యాధులు వంటి కాలానుగుణ వ్యాధుల నుండి పక్షులను రక్షించడానికి విటమిన్లు, సప్లిమెంట్లు, యాంటీబయాటిక్స్ కూడా సాధారణంగా ఉపయోగిస్తారు. మూలికా స్నానాలు, ఆవిరి చికిత్స వంటి ప్రత్యేక చికిత్సలు కోళ్ల శరీరాలను దృఢంగా చేస్తాయని నమ్ముతారు. తద్వారా అవి ఫైటింగ్ సమయంలో గాయాలను తట్టుకోగలవు, దూకుడుగా ఉంటాయి. చాలా ప్రాంతాలు పక్షుల కాళ్లకు కట్టిన కత్తులను ఉపయోగిస్తుండగా.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు కత్తులు లేని పోటీలను నిర్వహిస్తాయి. ఇక్కడ కోళ్లకు సహజంగా పెరిగిన ముల్లును పదును పెట్టి ఆయుధంగా ఉపయోగిస్తారు. హైకోర్టు సీరియస్ మరోవైపు కోడిపందేలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కోడి పందేలు నిర్వహించే వారిపై జంతు హింస నిరోధక చట్టం 1960, ఏపీ జూద నిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయాలని హైకోర్టు.. కలెక్టర్లు, ఎస్‌పి లకు ఆదేశాలు ఇచ్చింది. గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. గ్రామాల్లో సభలు నిర్వహించాలని, చట్ట నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపింది. కోడి పందేల బరుల దగ్గర కోడి కత్తులు, ఇతర పందెం సామగ్రి, సొమ్మును వెంటనే స్వాధీనం చేసుకోవాలని తెలిపింది. అవసరమైతే 144 సెక్షన్ అమలు చేయాలని కోర్టు పేర్కొంది. ఎక్కడైనా ఉల్లంఘనలు ధిక్కరిస్తే.. వ్యక్తిగతంగా అధికారులే బాధ్యత వహించాలని హైకోర్టు తెలిపింది. కోడి పందేల గురించి తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని, ఇందులో తహశీల్దార్, ఎస్ఐ ర్యాంకుకు తగ్గని పోలీసు అధికారి, భారత జంతు సంక్షేమ బోర్డు ప్రతినిధి లేదా జంతు సంరక్షణకు పనిచేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సభ్యులుగా ఉండాలని చెప్పింది. తనిఖీలకు వెళ్లే సమయంలో ఇద్దరు పోలీసులు, ఒక ఫొటోగ్రాఫర్ సహాయకులుగా ఉండాలని ఆదేశించింది.



## బస్సుల కోసం పడిగాపులు..
## వత్తిడికి గురౌతున్న ప్రయాణికులు..

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**


సంక్రాంతికి సొంత ఊరికి వెళ్లే ప్రయాణికులతో రాష్ట్రవ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. అత్యధిక సంఖ్యలో పట్టణం నుంచి ఊరుబాట పట్టారు. ఓవైపు జనానికి సరిపడా బస్సులు నడపలేక ఆర్టీసీ, నానా అవస్థలు పడుతూ ఆ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి బయలుదేరే అన్ని బస్సులూ పరిమితికి మించి ప్రయాణిస్తున్నాయి. బస్టాండ్‌కు వచ్చిన క్షణాల్లోనే బస్సులు నిండిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. టీజీఎస్ఆర్టీసీ 6,431 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా ప్రయాణికుల సమస్యలను తీర్చలేకపోతున్నాయి. బస్సులు సరిపడగా లేకపోవడంతో చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు కార్‌పూలింగ్ సేవలు కూడా వినియోగించుకుంటున్నారు.



## తిరుమలలో పురందరదాసుల
## ఆరాధనా మహోత్సవాలు

**తిరుమల (ఏడీఎన్ఎన్):**

కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు దాససాహిత్య ప్రాజెక్టు జనవరి 17 నుంచి 19వ తేదీ వరకు తిరుమలలో నిర్వహిస్తున్నామని టీటీడీ అధికారులు వివరించారు. తొలి రోజు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు, పురందర సాహిత్య గోష్ఠి, వివిధ పీఠాధిపతుల మంగళాశాసనాలు, సంకీర్తనమాలను నిర్వహిస్తామన్నారు. జనవరి 18న ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద పురందరదాసుల విగ్రహానికి పుష్పమాల, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనం వరకు శ్రీవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు, ఊంజల్‌సేవ, దాససంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. చివరి రోజు 19న ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, ఉపన్యాసాలు, సంగీత విభావరి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



## కొడుక్కి పెళ్లి చేయని
## ఇద్దరు భార్యల తండ్రి!

**కర్ణాటక (ఏడీఎన్ఎన్):**

తండ్రి తనకు పెళ్లి చేయట్లేదని కోపం పెంచుకున్నాడు కొడుకు. తండ్రికి ఇద్దరు భార్యలున్నా తన పెళ్లి విషయంలో పట్టనట్టు ఉంటున్నాడని ఆగ్రహంతో ఊగిపోయాడు. చివరకు ఓ రోజు రాత్రివేళ నిద్రలో ఉన్న తండ్రిని కొట్టి చంపాడు. కర్ణాటకలో ఈ దారుణం వెలుగు చూసింది. కొడుక్కి 35 ఏళ్లు. ఇంకా పెళ్లి కాలేదు. అతడి తోటి వాళ్లందరూ పెళ్లి చేసుకుని పిల్లాపాపలతో సెటిలైపోయారు. ఇద్దరు భార్యలున్న తండ్రి మాత్రం తన పెళ్లిపై శ్రద్ధ పెట్టట్లేదని అతడు కోపంతో రగిలిపోయాడు. చివరకు విచక్షణ మరిచి కన్న తండ్రినే దారుణంగా అంతమొందించాడు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఇటీవల ఈ దారుణం వెలుగుచూసింది. నిందితుడిని హొసదుర్గకు చెందిన ఎస్ నింగరాజగా పోలీసులు గుర్తించారు. అతడు తన తండ్రి టీ సన్ననింగప్ప నిద్రలో ఉండగా దాడి చేసి అంతమొందించాడని చెప్పారు. నిందితుడి సోదరుడు మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నింగరాజ పొలం పనులు చూసుకోకుండా సోమరిగా మారాడంటూ తన తండ్రి నింగప్ప ఆగ్రహించే వాడని మారుతి తెలిపాడు. తండ్రికి ఇద్దరు భార్యలున్నా తన పెళ్లి విషయంలో మాత్రం ఆయన శ్రద్ధ పెట్టట్లేదని నింగరాజ కోపం పెంచుకున్నాడని తెలిపారు. ఈ విషయంలో ఇంట్లో గొడవలు జరుగుతుండేవని చెప్పారు. బుధవారం రాత్రి కూడా తండ్రీకొడుకుల మధ్య మళ్లీ ఇదే విషయంలో తీవ్ర వాగ్వాదం జరిగిందని చెప్పారు. ఈ క్రమంలో తండ్రిని చంపేస్తానని నింగరాజ బెదిరించాడని అన్నారు. ఆ రాత్రి నింగప్ప నిద్రిస్తున్న సమయంలో నింగరాజ ఆయనను ఇనుప రాడ్డుతో కొట్టి చంపేశాడని అన్నాడు. నింగరాజ దాడి చేసినట్టు తనకు అర్ధరాత్రి ఫోన్ రావడంతో తాను వెళ్లి తండ్రిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్టు తెలిపాడు. కానీ అప్పటికే నింగప్ప మృతి చెందాడని డాక్టర్లు చెప్పారని అన్నాడు. ఈ నేపథ్యంలో మారుతి ఫిర్యాదు మేరకు పోలీసులు నింగరాజపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



## ఢిల్లీపై ముంబై ఇండియన్స్
# ఘన విజయం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ పాత ఫామ్‌ను తిరిగి అందిపుచ్చుకుని తొలి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ను 51 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించిన ముంబై, బౌలింగ్‌లోనూ అదే పదును చూపిస్తూ ఢిల్లీని కట్టడి చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై బౌలర్ల ధాటికి తట్టుకోలేక 145 పరుగులకే కుప్పకూలింది. దీంతో ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో తన మొదటి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై, హర్మన్‌ప్రీత్ కౌర్ (74*), నేట్ సీవర్ బ్రంట్ (70) మెరుపు ఇన్నింగ్స్ లతో 20 ఓవర్లలో 195/4 భారీ స్కోరు చేసింది. అనంతరం 196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ, ముంబై బౌలర్ల ధాటికి తట్టుకోలేక 145 పరుగులకే ఆలౌట్ అయింది. చినెలె హెన్రీ (56) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ విజయం ద్వారా ముంబై ఇండియన్స్ సీజన్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది.



## జాతీయ బాక్సింగ్‌లో
# తెలంగాణ పంచ్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

జాతీయ సీనియర్ బాక్సింగ్ టోర్నీలో తెలంగాణ బాక్సర్లు మరోసారి తమ పంచ్ విసిరి సత్తా చాటారు. మహిళల విభాగంలో నిఖత్ జరీన్, పురుషుల విభాగంలో మహ్మద్ హుసాముద్దీన్ టైటిళ్లు సాధించి విజేతలుగా నిలిచారు. మహిళల 51 కేజీల విభాగం ఫైనల్లో నిఖత్ జరీన్ మాజీ ప్రపంచ ఛాంపియన్ నీతును ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. ఈ విజయంతో నిఖత్ తన కెరీర్‌లో మూడో జాతీయ సీనియర్ టైటిల్ అందుకోవడం విశేషం. మ్యాచ్ మొత్తం నిఖత్ దూకుడైన ఆటతీరుతో ఆధిపత్యం చెలాయించింది. మహిళల 75 కేజీల విభాగంలో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ మరోసారి తన స్థాయిని నిరూపించింది. ఫైనల్లో ఆమె సనామచా చానుపై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. అదనంగా 48 కేజీల్లో మీనాక్షి హుడా, 70 కేజీల్లో అరుంధతి చౌదరి, 80 కేజీల్లో పూజ రాణి ఫైనల్లో విజయాలు సాధించి జాతీయ ఛాంపియన్లుగా నిలిచారు. పురుషుల విభాగంలో తెలంగాణ బాక్సర్ మహ్మద్ హుసాముద్దీన్ ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. 60 కేజీల విభాగం ఫైనల్లో సర్వీసెస్‌కు చెందిన సహచర బాక్సర్ సచిన్ సివాచ్‌ను ఓడించి టైటిల్ ను గెలుచుకున్నాడు. హుసాముద్దీన్ ప్రస్తుతం సర్వీసెస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇతర పురుషుల విభాగాల్లో 55 కేజీల్లో జాదుమణి సింగ్, 65 కేజీల్లో అబినాష్ జామ్వాల్ టైటిళ్లు సాధించారు. ఈ టోర్నీ ద్వారా భారత బాక్సింగ్ లో యువతతో పాటు సీనియర్లు కూడా బలంగా ఉన్నారనే విషయం మరోసారి స్పష్టమైంది. తెలంగాణ నుంచి నిఖత్ జరీన్, మహ్మద్ హుసాముద్దీన్ సాధించిన విజయాలు రాష్ట్ర క్రీడాభిమానులకు గర్వకారణంగా నిలిచాయి.



## రూ.500 కోట్ల సమీకరణకు
# హైదరాబాద్ సంస్థ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

రంగుల తయారీ, పెయింటింగ్ సేవల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న హైదరాబాద్ కు చెందిన టెక్నో పెయింట్స్ అండ్ కెమికల్స్ తొలి పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ.500 కోట్ల వరకు సమీకరించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి 2026- 27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సెబీ వద్ద ముసాయిదా రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేయనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఎండీ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. అవసరమైన అనుమతులు లభిస్తే సెప్టెంబరు 2026లో ఐపీఓను నిర్వహించాలన్నది కంపెనీ ప్రణాళికగా తెలిపారు. టెక్నో పెయింట్స్ బ్రాండ్ ను దేశవ్యాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా బ్రాండ్ గుర్తింపు పెరిగి, సంస్థ వృద్ధి మరింత వేగవంతమవుతుందని కంపెనీ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా 2029- 30 నాటికి రూ.2,000 కోట్ల వార్షిక ఆదాయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు కంపెనీ ఎండీ పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు రూ.90,000 కోట్ల విలువైన దేశీయ రంగుల పరిశ్రమ ఏటా 5 నుంచి 9 శాతం వృద్ధి నమోదు చేస్తోందని, ఈ వృద్ధిలో టెక్నో పెయింట్స్ కీలక భాగస్వామిగా మారాలన్నదే లక్ష్యమన్నారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల పెట్టుబడితో కొత్త తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో హైదరాబాద్‌లో ఒక అత్యాధునిక ప్లాంట్, అలాగే ఉత్తర, పశ్చిమ భారత్‌లో రెండు కొత్త ప్లాంట్లు నిర్మించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 7 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, డిసెంబరు నాటికి మరో 5 రాష్ట్రాలకు విస్తరించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ విస్తరణకూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2026-27లో ఆగ్నేయాసియా దేశాల్లోకి అడుగుపెట్టాలని, అవసరాన్ని బట్టి అక్కడ కూడా ఒక తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కంపెనీలో సుమారు 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# గంగూలీ రికార్డు బ్రేక్ చేసిన విరాట్ కోహ్లి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. భారత్ తరఫున అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ఐదో స్థానానికి కోహ్లి చేరాడు. వడోదర వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న తొలి వన్డేలో అతడు ఈ రికార్డును నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లికి ఇది 309వ వన్డే. దీంతో ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 308 వన్డేల రికార్డుని కోహ్లి అధిగమించాడు. గంగూలీ తన వన్డే కెరీర్‌లో 11,221 పరుగులు సాధించాడు. ఇక ఈ జాబితాలో అగ్రస్థానంలో 463 వన్డేలు సచిన్ టెండూల్కర్ కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ వన్డేల్లో 18,426 అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కూడా సచిన్ పేరిట రికార్డు ఉంది. ప్రపంచ వన్డే క్రికెట్ చరిత్రలోనూ విరాట్ కోహ్లి తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు (53) చేసిన ఆటగాడిగా కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే వన్డేల్లో 14,557 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ టెండూల్కర్ - 463, ఎంఎస్ ధోని - 347, రాహుల్ ద్రవిడ్ - 340, మహ్మద్ అజారుద్దీన్ - 334, విరాట్ కోహ్లి - 309, సౌరవ్ గంగూలీ - 308 మొదటి స్థానాల్లో ఉన్నారు.

# శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీపైనే గిల్ సేన ఆశలు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



టీమ్ఇండియా ఈ ఏడాదిలో తొలి సిరీస్‌గా న్యూజిలాండ్‌తో మూడు వన్డేల పోరుకు సిద్ధమైంది. వడోదర వేదికగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో విజయం సాధించి కొత్త సంవత్సరాన్ని ఘనంగా ఆరంభించాలని శుభ్‌మన్ గిల్ సేన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సిరీస్‌తో గాయం నుంచి కోలుకుని శ్రేయస్ అయ్యర్ పునరాగమనం చేస్తున్నాడు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అతడి పాత్ర కీలకమని మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. అయితే పునరాగమనంలో తొందరపడకుండా జాగ్రత్తగా ఆడాలని సూచించాడు. నాలుగో స్థానంలో శ్రేయస్ బ్యాటింగ్ జట్టుకు బలంగా మారుతుందని తెలిపాడు. 'ఇన్నింగ్స్ ను మంచిగా ప్రారంభించి జట్టుకు వెంటనే సహకారం అందించాలనే తొందరలో ఉండొచ్చు. శ్రేయస్ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అయితే.. ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో రాణించి గొప్ప పునరాగమనం చేశాడు. అతడికి వన్డే క్రికెట్‌పై మంచి అవగాహన ఉంది. 2023 నుంచి అతడు స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ.. ఆడిన తీరు కనువిందుగా ఉంది. అతడి నైపుణ్యాలు చాలా ఉపయోగపడతాయి. అని అభిప్రాయపడ్డాడు. ఇక కెప్టెన్‌గా గిల్‌పై ఇప్పుడే అంచనాలు వేయడం సరికాదని బంగర్ చెప్పాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ల అనుభవం అతడికి తోడుగా ఉంటుందని పేర్కొన్నాడు. మరోవైపు గాయం కారణంగా రిషభ్ పంత్ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు.

# న్యూజిలాండ్ జట్టులో భారత సంతతి ఆటగాడు



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

వడోదర వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ శనివారం ప్రారంభమైంది. ఈ సిరీస్‌లో న్యూజిలాండ్ ఆటగాడు భారత మూలాలున్న స్పిన్నర్ ఆదిత్య అశోక్‌పై అందరూ ప్రత్యేక ఆసక్తి కనపరుస్తున్నారు. రైట్ ఆర్మ్ లెగ్ బ్రేక్ బౌలర్ అయిన అశోక్, గూగ్లీలు వేయడంలో దిట్టగా పేరొందాడు. ఆదిత్య అశోక్ 2002 సెప్టెంబర్ 5న తమిళనాడులోని వేలూరులో జన్మించాడు. నాలుగేళ్ల వయసులోనే కుటుంబంతో కలిసి న్యూజిలాండ్ కు వలస వెళ్లి ఆక్లాండ్ లో స్థిరపడ్డాడు. మౌంట్ ఆల్బర్ట్ గ్రామర్ స్కూల్లో చదువుకున్న అశోక్, అక్కడి నుంచి క్రికెట్ లో ఎదిగాడు. ఆక్లాండ్ తరఫున దేశీయ క్రికెట్ లో రాణించిన అతడు 2020 అండర్19 వరల్డ్ కప్ లో కూడా పాల్గొన్నాడు. దేశీయంగా 2021లో సూపర్ స్మాష్ టీ20లో అరంగేట్రం చేయగా, 2022లో ఫోర్డ్ ట్రోఫీ ద్వారా లిస్ట్‌ఏ, 2022-23లో ప్లంకెట్ షీల్డ్ ఫస్ట్ క్లాస్ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లోనే ఐదు వికెట్లు తీసి సత్తా చాటాడు. 2023లో యూఏఈపై టీ20 అరంగేట్రం, అదే ఏడాది డిసెంబర్లో బంగ్లాదేశ్ తో వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు న్యూజిలాండ్ తరఫున రెండు వన్డేలు, ఒక టీ20 మ్యాచ్ ఆడాడు. భారత మూలాలున్న క్రికెటర్లు న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం కొత్త కాదు. టామ్ పునా నుంచి దీపక్ పటేల్, జీత్ రావల్, ఈష్ సోధి, ఎజాజ్ పటేల్, రచిన్ రవీంద్ర వరకు ఈ జాబితా ఉంది. తాజాగా ఆదిత్య అశోక్ కూడా అదే బాటలో సాగుతూ, న్యూజిలాండ్ స్పిన్ బౌలింగ్ కు భవిష్యత్తుగా గుర్తింపు పొందుతున్నాడు.

## నర్సరీ స్నేహం నుంచి ఈవీ విప్లవం వరకూ...
# అల్ట్రావయొలెట్ బైక్స్



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నర్సరీ నుంచి ఇంటర్ వరకూ కలిసే చదువుకున్న నీరజ్, సుబ్రమణి స్నేహం కాలక్రమంలో ఒక వినూత్న వ్యాపారంగా రూపుదిద్దుకుంది. టెక్నాలజీపై ఆసక్తి ఉన్న నీరజ్, డిజైన్ పై మక్కువ చూపిన సుబ్రమణి తమ తమ రంగాల్లో నైపుణ్యం సంపాదించి చివరకు ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగంలో కలసి అడుగు పెట్టారు. 2016లో అల్ట్రావయొలెట్ ఆటోమొబైల్స్ ను ప్రారంభించి, భారత ఈవీ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. యాహూలో ఉద్యోగం చేసిన నీరజ్ సంస్థకు సీటీవోగా వ్యవహరిస్తుండగా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్, స్వీడన్ లోని ఉమేయా ఇనిస్టిట్యూట్ లలో చదువుకున్న సుబ్రమణి సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. సంప్రదాయ ఈవీల పరిమితులను దాటుతూ, వేగం, డిజైన్, బ్యాటరీ సామర్థ్యాన్ని సమన్వయపరిచి ఎఫ్77 మోడల్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి దాదాపు పదేళ్లు కృషి చేశారు. రాడార్ టెక్నాలజీ, ఫ్రంట్ రియర్ కెమెరాలు, 8 లక్షల కిలోమీటర్ల బ్యాటరీ వారంటీ వంటి అత్యాధునిక ఫీచర్లతో అల్ట్రావయొలెట్ బైక్‌లు ప్రత్యేకతను సొంతం చేసుకున్నాయి. ప్రస్తుతం F77 మాక్స్ 2, F77 సూపర్ స్ట్రీట్, X47 క్రాసోవర్ మోడళ్లు భారత్‌తో పాటు నెదర్లాండ్స్, లక్సెంబర్గ్, బెల్జియం వంటి దేశాల్లో ఆదరణ పొందుతున్నాయి. ఈ సంస్థపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోంది. జోహో, టీవీఎస్ మోటార్స్, క్వాల్కమ్ వెంచర్స్, లింగోట్టోతో పాటు స్విగ్గీ సహవ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి, నటుడు దుల్కర్ సల్మాన్ వంటి వారి నుంచి రూ.1200 కోట్ల పెట్టుబడులు సమీకరించింది. విజయవాడ, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 100 నగరాల్లో విక్రయాలు సాగిస్తున్న అల్ట్రావయొలెట్, మరో రెండేళ్లలో ఐపీఓకు వచ్చే యోచనలో ఉన్నట్లు తెలిపింది.

# డ్వాక్రా మహిళలకు బ్యాంక్‌కు వెళ్లకుండానే రుణాలు


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పొదుపు సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు నాయుడు సంక్రాంతి సందర్భంగా శుభవార్త చెప్పారు. ఇక నుంచి మహిళా డ్వాక్రా సంఘాలకు రుణాలు పూర్తిగా ఆన్ లైన్ విధానంలోనే అందించనున్నట్లు ప్రకటించారు. దీనికోసం ప్రత్యేక ఆన్ లైన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం రుణాల కోసం మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుండగా, అవసరమైన పత్రాల సమర్పణతో ప్రక్రియ ఆలస్యమవుతోందని సీఎం పేర్కొన్నారు. ఈ సమస్యలకు ముగింపు పలుకుతూ, త్వరలోనే డ్వాక్రా మహిళలు ఇంటి నుంచే మొబైల్ ఫోన్ ద్వారా రుణ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు తర్వాత ప్రభుత్వమే ఆన్ లైన్‌లో రుణాన్ని మంజూరు చేయనుంది. స్త్రీ నిధి, ఉన్నతి వంటి పథకాల ద్వారా ఇప్పటివరకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను కూడా ఇకపై ఆన్‌లైన్ ద్వారానే పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు స్మార్ట్ ఫోన్లు అందించడంతో పాటు 'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ యాప్ ద్వారా సంఘ లెక్కలు, తీసుకున్న రుణాలు, చెల్లించిన మొత్తాలు, బకాయిల వివరాలను మహిళలు సులభంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

# షాపింగ్‌లో ఏఐ సలహాలకు ప్రాధాన్యం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):




ఆన్ లైన్ షాపింగ్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాలకు కూడా ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా జెన్ జీ ఏఐ విప్లవానికి నాయకత్వం వహిస్తోంది. ఇటీవల కాలంలో జెన్ జీ తరం ఎక్కువగా ఏఐ సలహాలు, సంప్రదింపులపైనే కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతంలో స్నేహితులు, బంధువులను మాత్రమే సంప్రదించే అలవాటున్నవారు కూడా ఏఐ వైపే మొగ్గు చూపుతున్నారు. కనీసం 10 మందిలో 7గురు రోజులో రెండు గంటల పాటు ఈ టూల్స్ తోనే కాలం గడుపుతున్నారు. దీనితో వ్యాపార సంస్థలు కూడా వీటికి ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించినట్లు సూచనలున్నాయి. ఆధునిక ఏఐ టెక్నాలజీలు వినియోగదారుల కొనుగోలు ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో, పర్సనల్ షాపింగ్ అనుభవాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఏఐ ఆధారిత సిఫారసులు, ప్రైస్ కంప్యేరిజన్, డీల్ సూచనలు వంటి లక్షణాలు కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. వినియోగదారుల్లో క్రమంగా ఏఐ ఆధారిత షాపింగ్ టూల్స్ పట్ల వినియోగం పెరుగుతూ ఉంది. తక్షణ సమాచారం, ఉత్తమ డీల్స్ కనుగొనడం, సమయాన్ని ఆదా చేయడం వంటి ప్రయోజనాల వల్ల వినియోగదారులలో వాడకం ఎక్కువగా అభివృద్ధి చెందుతోంది. వ్యాపారంలో ఎదురయ్యే పోటీ, విక్రేతలు, ఈకామర్స్ ప్లాట్‌ఫారంలు ఏఐ అనలిటిక్స్ ని విస్తృతంగా ఉపయోగించి వినియోగదారుల సూచనలను మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా ఉన్నాయి. AI ప్రముఖ ఫీచర్లను అధిక ప్రాధాన్యతగా పెట్టడం ఇప్పుడు పెద్ద షాపింగ్ వ్యూహాల భాగమైందని పరిశీలకులు భావిస్తున్నారు.



## పంత్‌కు గాయం..
# జురెల్‌కు అవకాశం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. గాయంతో రిషభ్ పంత్ ఈ సిరీస్ కు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ వికెట్‌కీపర్ ధ్రువ్ జురెల్‌ను జట్టులోకి ఎంపిక చేసినట్లు బీసీసీఐ ప్రకటించింది. వడోదరలో జరిగిన ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా పంత్‌కు ఉదర భాగంలో నొప్పి రావడంతో ఎంఆర్ఐ స్కాన్ చేయించగా, 'సైడ్ స్ట్రెయిన్'గా నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచనల మేరకు అతడిని వన్డే సిరీస్ నుంచి తప్పించారు. విజయ్ హజారే ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేసిన జురెల్ ఆదివారం జట్టులో చేరాడు. అతడు రిజర్వ్ వికెట్ కీపర్ గా అందుబాటులో ఉంటాడు. నేడు వడోదర వేదికగా భారత్-న్యూజిలాండ్ తొలి వన్డే జరగనుంది.

# కివీస్‌పై 'కింగ్ కోహ్లి' గర్జన

మొదటిపేజీ తరువాయి.....

కోహ్లి 91 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 93 పరుగులు చేసి జట్టును విజయానికి చేరువ చేశాడు. అయితే సెంచరీకి కేవలం 7 పరుగుల దూరంలో భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటవ్వడంతో అభిమానులు కాస్త నిరాశకు గురయ్యారు. అతడికి తోడుగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56), శ్రేయస్ అయ్యర్ (49) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ లు ఆడి ఇన్నింగ్స్ ను నిలబెట్టారు. కోహ్లి నిష్క్రమణ తర్వాత వరుస వికెట్లు పడటంతో మ్యాచ్ ఉత్కంఠగా మారినప్పటికీ, కేఎల్ రాహుల్ (29 నాటౌట్) , యువ ఆటగాడు హర్షిత్ రానా (29) అద్భుతమైన సమన్వయంతో ఆడి 49 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్ 4 వికెట్లతో భారత డగౌట్‌లో టెన్షన్ పుట్టించినా, భారత్ విజయాన్ని అడ్డుకోలేకపోయాడు. సిరీస్‌లో రెండో వన్డే బుధవారం రాజ్‌కోట్ వేదికగా జరగనుంది.



# పసిడి ప్రియులకు ఊరట

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ , విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఈ రోజు 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,28,750 వద్ద స్థిరంగా ఉండగా, అత్యంత స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,40,460 వద్ద కొనసాగుతోంది. వెండి ధర కూడా ఎటువంటి మార్పు లేకుండా కిలో రూ. 2,75,000 వద్దే ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, పండుగ సీజన్‌లో స్థానిక మార్కెట్లో ధరలు స్థిరంగా ఉండటం కొనుగోలుదారులకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది. అయితే, ఈ ధరలకు అదనంగా జీఎస్టీ మరియు తయారీ ఛార్జీలు వర్తిస్తాయని జ్యువెలరీ వర్గాలు పేర్కొంటున్నాయి.



## బయో ఆయుధాలపై
# బిల్ గేట్స్ ఆందోళన

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఏఐ దుర్వినియోగం వల్ల బయో ఆయుధాల సృష్టికి దారితీయొచ్చని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల పరిధిలోకి రాని కొన్ని శక్తులు వ్యక్తులు లేదా సంస్థలు ఓపెన్ సోర్స్ ఏఐ ఉత్పత్తులను ఉపయోగించి బయోటెర్రరిజం ఆయుధాలను రూపొందించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓపెన్ సోర్స్ టెక్నాలజీ విస్తరిస్తున్న కొద్దీ ఈ ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కృత్రిమ మేధ సాంకేతికతను ఎలా అభివృద్ధి చేస్తున్నారనే అంశం నుంచి, దాన్ని ఏ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారన్న దాకా సమగ్ర పరిశీలన తప్పనిసరిగా అవసరమని బిల్ గేట్స్ స్పష్టం చేశారు. కొత్త మహమ్మారి వచ్చినప్పుడు ప్రపంచం సమర్థంగా ఎదుర్కోలేకపోతుందని తాను 2015లోనే హెచ్చరించానని గుర్తు చేసిన గేట్స్, కొవిడ్ మహమ్మారి తన అంచనాలను నిజం చేసిందన్నారు. ముందస్తు సన్నద్ధత ఉంటే ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. అయితే భవిష్యత్తులో మహమ్మారుల కంటే కూడా ఏఐ దుర్వినియోగమే మరింత ప్రమాదకర ముప్పుగా మారవచ్చని వ్యాఖ్యానించారు. ఇక ఉద్యోగ రంగంపై ఏఐ ప్రభావం కూడా తీవ్రమవుతుందని గేట్స్ తెలిపారు. తక్కువ కార్మిక శక్తితో ఎక్కువ ఉత్పత్తి, సేవలు అందించేందుకు ఏఐ ఉపయోగపడుతున్నప్పటికీ, సాఫ్ట్ వేర్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో ఇప్పటికే ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం కనిపిస్తోందన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

## 'ఆదర్శ కుటుంబం'
# పట్టాలెక్కిన క్రేజీ కాంబో..



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న కాంబోలలో విక్టరీ వెంకటేష్-దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ జోడీ ఒకటి అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలా ఏళ్లుగా ఈ ఇద్దరూ కలిసి సినిమా చేస్తారని వార్తలు వినిపించినప్పటికీ, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఇప్పుడు ఆ నిరీక్షణకు ముగింపు పలుకుతూ వెంకటేష్, త్రివిక్రమ్ కలిసి 'ఆదర్శ కుటుంబం ఎకె47' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కాంబోపై ప్రేక్షకుల్లో ఇంతటి అంచనాలు ఏర్పడటానికి ప్రధాన కారణం వీరి గత అనుబంధమే. వెంకటేష్ హీరోగా తెరకెక్కిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి సినిమాలకు త్రివిక్రమ్ కథ, మాటలు అందించి అవి ఎవర్‌గ్రీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్లుగా నిలిచాయి. విడుదలైన ఇన్నేళ్ల తర్వాత కూడా టీవీలో వస్తే తప్పక చూసే సినిమాలుగా అవి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. ఆ కామెడీ టైమింగ్, భావోద్వేగాలు, కుటుంబ విలువలు కలిసి వచ్చిన మ్యాజిక్ మళ్లీ తెరపై చూడాలని ఫ్యాన్స్ ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. ఇప్పుడు అదే కోరికను నెరవేర్చేలా 'ఆదర్శ కుటుంబం' ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను దర్శకుడు త్రివిక్రమ్ అత్యంత వేగంగా పూర్తి చేయాలని గట్టి ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా త్రివిక్రమ్ సినిమాలు షూటింగ్ పూర్తవ్వడానికి ఎక్కువ సమయం పడుతాయనే అభిప్రాయం ఉన్నా, ఈ సినిమాతో ఆ ఇమేజ్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఆయన ముందుకెళ్తున్నారట. మే నెల కల్లా షూటింగ్ మొత్తం పూర్తి చేసి, సమ్మర్‌లోనే సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో షెడ్యూళ్లను కట్టుదిట్టంగా ప్లాన్ చేస్తున్నారని టాక్. గత చిత్రం 'గుంటూరు కారం' తర్వాత తనపై వచ్చిన విమర్శలకు చెక్ పెట్టాలనే ఆలోచనతోనే త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో జాగ్రత్తగా, అదే సమయంలో స్పీడ్‌గా తెరకెక్కిస్తున్నాడని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. మరోవైపు వెంకటేష్ కూడా పూర్తిగా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టడంతో షూటింగ్ సాఫీగా సాగుతోందని సమాచారం. కుటుంబ ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ, వినోదంతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చే కథతో ఈ సినిమా రూపొందుతున్నట్లు తెలుస్తుండటంతో, 'ఆదర్శ కుటుంబం'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక ఈ క్రేజీ కాంబో మళ్లీ ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తుందో చూడాల్సిందే.



## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'
# ఫుల్ ఫన్ రైడ్ లా వుంటుంది

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్ మహారాజా రవితేజ

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ సినిమా జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

**ప్రీ రిలీజ్ ఈవెంట్లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ...**
మా ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, నేను కలిసి 13 సినిమాలు చేశాం. మా సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. ఈ సినిమాలో మా హీరోయిన్స్ చాలా అందంగా కనిపిస్తారు. నన్ను కూడా చాలా అందంగా చూపించాడు డీవోపీ ప్రసాద్ మూరెళ్ళ. తనతో తొమ్మిది సినిమాలు చేశాను. కొరియోగ్రాఫర్స్ శేఖర్, భాను కంపోజ్ చేసిన పాటలన్నీ కూడా సూపర్ హిట్ అయ్యాయి.

**డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ..**
అందరికి నమస్కారం. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి నాకు ఇష్టమైన ప్రొడ్యూసర్. చాలా సెన్సిబుల్ ప్రొడ్యూసర్. ఆయన బ్యానర్ లో నా సినిమా ఖచ్చితంగా ఉంటుంది ఆయనతో పని చేయాలని కోరుకుంటున్నాను. మిరపకాయ వచ్చిన మిస్టర్ బచ్చన్ వచ్చిన ఒకేలా ఉండే వ్యక్తి మాస్మహారాజా రవితేజ.

**డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ...**
మాలాంటి ఎంతో మంది డైరెక్టర్స్ అయ్యారంటే రవితేజ గారు పెట్టిన బిక్ష. అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్న మమ్మల్ని డైరెక్టర్లు చేశారు. త్వరలోనే ఆయనతో సినిమా చేస్తాను. రవితేజ గారు ఎన్నో డిఫరెంట్ కాన్సెప్ట్ లో ఉన్న సినిమాలు చేశారు. పవర్ సినిమా టైంలో డైరెక్టర్ కిషోర్ డైలాగ్స్ విషయంలో నాకు చాలా హెల్ప్ చేశారు. కచ్చితంగా తన నిజాయితీ తన హార్డ్ వర్క్ ఈ సినిమాకి పే చేస్తుంది.

**డింపుల్ హయాతి మాట్లాడుతూ..**
అందరికి నమస్కారం. డైరెక్టర్ హరీష్ శంకర్ గారిని ఇక్కడ చూడడం చాలా ఆనందంగా ఉంది ఈ సినిమా కూడా బొమ్మ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమాలో నేను చేసిన బాలమణి క్యారెక్టర్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. చాలా కొత్తదనం ఆడియన్స్ ఫీల్ అవుతారు. మా నిర్మాత సుధాకర్ గారు సినిమాని అద్భుతంగా నిర్మించారు. ఈ సినిమాలోని పాటలన్నీ చాలా బాగా హిట్ అయ్యాయి. రవితేజ గారితో ఇది నాకు రెండో సినిమా. ఆయనతో నటించడం చాలా ఆనందాన్నిచ్చింది డైరెక్టర్ గారు సినిమాని అద్భుతంగా తీశారు. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది.

**హీరోయిన్ ఆశిక రంగనాథ్ మాట్లాడుతూ..**
అందరికీ నమస్కారం. ఇది అద్భుతమైన జర్నీ. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ.. జనవరి 13 న మా బీఎండబ్ల్యూ(భర్త మహాశయులకు విజ్ఞప్తి) రైట్ కి వెళ్ళండి. కచ్చితంగా అదిరిపోతుంది. మూవీ డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాను. ఈ సినిమాలో పనిచేస్తున్న ప్రతి యాక్టర్ వాళ్ళ మధ్య కెమిస్ట్రీ చాలా అద్భుతంగా వర్కౌట్ అయింది.

-కటకం సుభాష్


## పొంగల్ బరిలోకి
# అన్నగారు దిగుతున్నారు!



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఈ ఏడాది సంక్రాంతి సినిమాల రిలీజ్ భలే ఉత్కంఠగా మారాయి. రావు అనుకున్న సినిమాలు వస్తున్నాయి. వస్తాయి అన్న సినిమాలు అనుకోకుండా వాయిదా పడ్డాయి. టాలీవుడ్ సినిమాల విషయం పక్కన పెడితే.. తమిళ్ సినిమాలు మాత్రం ఈ సంక్రాంతి విడుదలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విజయ్ జన నాయకుడు సెన్సార్ చిక్కుల్లో ఇరుక్కున్న విషయం తెల్సిందే. ఇక 'పరాశక్తి' సైతం వివాదంలో ఇరుక్కున్న విషయం కూడా విదితమే. ఏదో విధంగా అన్ని అడ్డంకులను దాటుకొని ఎట్టకేలకు 10 న రిలీజ్ కి నోచుకుంది. ప్రస్తుతం కోలీవుడ్ లో పొంగల్ బరిలో 'పరాశక్తి' ఒకటే దిగింది. ఇక సడెన్ గా నేనున్నా అంటూ వచ్చేశాడు కార్తీ. గత కొన్నేళ్లుగా కార్తీ నటించిన 'వా వాతియార్' సినిమా రిలీజ్ కి నోచుకోకుండా ఉండిపోయింది. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కె.ఈ జ్ఞానవేల్ రాజా నిర్మించాడు. ఏవో ఇబ్బందుల వలన వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమా డిసెంబర్ లో రిలీజ్ కు సిద్ధం చేశారు. తెలుగులో కూడా 'అన్నగారు వస్తారు' అనే పేరుతో రిలీజ్ కు రెడీ చేశారు. అంతా బావుంది అనుకున్న టైమ్ లో అర్జున్ లాల్ సుందర్ దాస్ అనే వ్యాపారవేత్త.. నిర్మాత తనకు బాకీ ఉన్నాడు.. ఆ బాకీ తీర్చేవరకు ఈ సినిమాను రిలీజ్ చేసే ప్రసక్తే లేదు అని కోర్టుకెక్కాడు. దాంతో 'అన్నగారు వస్తారు' మరోసారి వాయిదా పడింది. అయితే ఇంత అప్పు తీర్చి ఇప్పుడప్పుడే ఈ సినిమాను నిర్మాత రిలీజ్ చేయడమో అనుకుంటే.. సడెన్ సర్‌ప్రైజ్ ఇస్తూ పొంగల్ బరిలో అన్నగారు దిగుతున్నారు అంటూ అధికారికంగా ప్రకటించి షాక్ ఇచ్చాడు. జనవరి 14న వా వాతియార్ తమిళ్ లో రిలీజ్ కానుంది. నిజంగా ఇది కార్తీకి లక్కీ ఛాన్స్. విజయ్ సినిమా రాకపోవడంతో 'పరాశక్తి' ఒక్కటే కోలీవుడ్ లో నడుస్తుంది.

## రాజ్- డీకేతో
# మరో కీలక ప్రాజెక్ట్?



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ పరంగా అనుకున్న స్థాయిలో ఫలితాలు రావడం లేదు. గతేడాది విడుదలైన సికిందర్ భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. దాంతో సల్మాన్ నుంచి వచ్చే తదుపరి సినిమా అయినా హిట్ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఆయన ప్రస్తుతం చేస్తున్న సినిమాలు, తీసుకుంటున్న నిర్ణయాలు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ నటిస్తున్న ప్రధాన చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. 2020లో జరిగిన గల్వాన్ లోయ సంఘర్షణ నేపథ్యంగా రూపొందుతున్న ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. దేశభక్తి, సైనికుల వీరోచిత పోరాటాన్ని ప్రధానంగా తీసుకుని తెరకెక్కుతున్న ఈ చిత్రం, ఇటీవలి కాలంలో యుద్ధ వీరుల కథలపై వచ్చిన సినిమాలకు మంచి ఆదరణ లభిస్తుండటంతో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఇదే తరహా నేపథ్యంతో వచ్చిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయవంతం కావడంతో, ఈ సినిమా సల్మాన్ కెరీర్‌కు కీలక మలుపు అవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. షూటింగ్ దాదాపుగా పూర్తయినప్పటికీ, తుది దశ పనుల కోసం సల్మాన్ మరికొన్ని రోజులు డేట్లు కేటాయించనున్నట్లు సమాచారం. ఇదే సమయంలో సల్మాన్ ఖాన్ తన తదుపరి ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల బాలీవుడ్‌లో హీరోలు వరుసగా సినిమాలను ప్రకటిస్తూ ఏడాదికి కనీసం ఒకటి లేదా రెండు సినిమాలు విడుదలయ్యేలా కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్నారు. అదే బాటలో సల్మాన్ కూడా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ రేసులో నిలబడాలని చూస్తున్నారు.



## సెన్సార్ వివాదంలో
# 'జన నాయకుడు'

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నటుడు విజయ్ నటించిన 'జన నాయకుడు' సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఆలస్యం చేశారు. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ చెన్నై హైకోర్టులో కేసు వేసింది. కేసును విచారించిన న్యాయమూర్తి, సెన్సార్ బోర్డు పత్రాలు సమర్పించి, 'జన నాయకుడు' సినిమాకు వెంటనే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. కానీ దీన్ని వ్యతిరేకిస్తూ సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. దీంతో సర్టిఫికెట్ జారీ చేయాలన్న తీర్పుపై స్టే విధించారు. ఈ కేసును జనవరి 21కి వాయిదా వేశారు. కేసు వాయిదా పడటంతో ఆలస్యాన్ని నివారించడానికి, జననాయగన్ నిర్మాణ సంస్థ సెన్సార్ సర్టిఫికెట్ కోసం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది.

## దర్శకురాలిగా
# తనదైన ముద్ర



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో దర్శకత్వం వంటి సాంకేతిక విభాగాల్లో మహిళలు రాణించడం చాలా అరుదు. గొప్ప మహిళా దర్శకుల గురించి మాట్లాడుకున్నప్పుడు ముందుగా గుర్తొచ్చే పేర్లు భానుమతి మరియు విజయనిర్మల. వారి అడుగుజాడల్లో నడుస్తూ, తన సినిమాలతో ప్రేక్షకులను అలరించి, విజయవంతమైన దర్శకురాలిగా బి. జయ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఒక డైనమిక్ జర్నలిస్ట్ నుండి ప్రముఖ చిత్ర దర్శకురాలిగా ఎదిగిన ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని, జనవరి 11న ఆమె జయంతి సందర్భంగా స్మరించుకుందాం. 1964, జనవరి 11న రావులపాలెంలో జన్మించిన బి. జయ విద్యావంతురాలు. ఆమె ఇంగ్లీష్ లిటరేచర్, జర్నలిజం మరియు సైకాలజీలో డిగ్రీలు పూర్తి చేశారు. ఆమె ఆంధ్రాజ్యోతి మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో జర్నలిస్ట్ గా తన కెరీర్‌ను ప్రారంభించారు. డైనమిక్ రైటర్‌గా, నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పే వ్యక్తిగా ఆమె త్వరగానే మంచి పేరు తెచ్చుకున్నారు. ఆమె రాతలకు మంచి గుర్తింపు లభించింది, సినిమాపై ఉన్న మక్కువతో ఆమె చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి అసిస్టెంట్ డైరెక్టర్‌గా మారారు. కెరీర్ తొలినాళ్లలో, అప్పటికే సినీ జర్నలిస్ట్ గా, పి.ఆర్.ఓ (PRO)గా రాణిస్తున్న బి.ఏ. రాజును ఆమె వివాహం చేసుకున్నారు. వారిద్దరూ కలిసి అంకితభావం, బాధ్యతలతో ఒక శక్తివంతమైన జంటగా నిలిచారు. 1994లో వారు 'సూపర్ హిట్' సినిమా వారపత్రికను స్థాపించారు. వారి కృషితో అది ఇండస్ట్రీలోనే నెంబర్ వన్ సినీ పత్రికగా నిలిచింది. దశాబ్దాల పాటు ఒక్క సంచిక కూడా మిస్ అవ్వకుండా పత్రికను ప్రచురించడం, వారి వృత్తి పట్ల వారికి ఉన్న అద్భుతమైన నిబద్ధతకు నిదర్శనం. భర్త సహకారంతో, బి. జయ దర్శకత్వంపై తనకున్న మక్కువను నిజం చేసుకున్నారు. వారి మొదటి చిత్రం 'ప్రేమలో పావని కళ్యాణ్' నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన తర్వాత, 'చంటిగాడు' సినిమాతో దర్శకురాలిగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఘనవిజయం సాధించి, 25 కేంద్రాల్లో 100 రోజులు ఆడింది. ఆ తర్వాత ఆమె ప్రేమికులు, గుండమ్మగారి మనవడు, లవ్లీ, వైశాఖం వంటి హిట్ చిత్రాలు అందించారు. ఈ విజయాలు పరిశ్రమలోని దిగ్గజ మహిళా దర్శకుల సరసన ఆమెకు ఒక ప్రముఖ స్థానాన్ని పదిలపరిచాయి. సినిమాలకే పరిమితం కాకుండా, బి. జయ మరియు బి.ఏ. రాజు దంపతులు యావత్ చిత్ర పరిశ్రమతో దగ్గిర అనుబంధాన్ని కలిగి ఉండేవారు.

## కామెడీ చేయడం
# కత్తి మీద సాము

### 'నారి నారి నడుమ మురారి' డైరెక్టర్ రామ్ అబ్బరాజు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



**చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్ అబ్బరాజు మీడియా సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఆ విశేషాలు...**

**ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే.. సంక్రాంతి వైబ్ కనిపిస్తుంది.. సంక్రాంతి కోసమే తీసిన సినిమానా ఇది?**
ఇది పండగ లాంటి సినిమానే. కాకపోతే శర్వా గారి బైకర్ సినిమా విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాలవల్ల అది వాయిదా పడింది. దీంతో మాకు సంక్రాంతికి వచ్చే మంచి అవకాశం దొరికింది. మంచి యూత్ ఫుల్ ఫన్ ఉన్న ఎంటర్టైన్మెంట్ ఇది. చిన్నప్పటి నుంచి సంక్రాంతికి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగా. ఇప్పుడు డైరెక్టర్ గా ఫస్ట్ టైం సంక్రాంతికి నా సినిమా రావడం అనేది నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ తో అందరి ఆడియన్స్ ని అలరించడం ఇష్టం. నేను తీసిన వివాహ భోజనంబు, సామజవరగమన, ఇప్పుడు ఈ సినిమా కూడా చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. అందరూ కలిసి హాయిగా చూసి ఎంజాయ్ చేసేలా వుంటుంది. నాకు ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ వున్న సినిమాలు చేయడమే చాలా ఇష్టం.

**ఇద్దరమ్మాయిలతో చాలా కథలు వచ్చాయి కదా.. ఈ ప్రేమ కథ ఎలా ఉండబోతుంది?**
ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి అంటే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని ఫీలింగు వస్తుంది. కానీ ఇందులో చాలా కొత్త పాయింట్ ఉంది. సామజవరగమన ట్రైలర్ లో చూస్తే అసలు కాన్ఫ్లిక్ట్ మేము రివిల్ చేయలేదు. ఇంటర్వెల్ దగ్గర అసలు కాన్ఫ్లిక్ట్ వస్తుంది. అది ఒక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ఈ సినిమాలో కూడా ఒక కొత్త కాన్సెప్ట్ ఉంది. మేము ఇప్పుడే రివిల్ చేయడం లేదు. బిగ్ స్క్రీన్ పై చూడాల్సిందే.

**కామెడీ చేయడం కష్టం కదా?**
కామెడీ చేయడం కత్తి మీద సాము. సిచువేషన్ తో ఉండే కామెడీ వస్తే ఆటోమేటిక్గా ఆర్గానిక్ గా నవ్వులు వస్తాయి. ఈ సినిమాలో కామెడీ కూడా చాలా ఆర్గానిక్ గా ఉంటుంది. ఇందులో సెకండ్ హాఫ్ క్లైమాక్స్ దగ్గర చాలా మంచి ఎమోషన్ వర్కౌట్ అయింది. సత్య, సుదర్శన్, వెన్నెల కిషోర్ గారి పాత్రలు చాలా హిలేరియస్ గా ఉంటాయి.

**శర్వా గారు ఇందులో చాలా యంగ్ అండ్ స్లీక్ లుక్ లో కనిపిస్తున్నారు కదా?**
శర్వా గారు బైకర్ సినిమా చేశారు. ఆ సినిమా కోసం చాలా కొత్తగా మేకోవర్ అయ్యారు. అది మాకు కలిసి వచ్చింది. మేము ఫస్ట్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్,తర్వాత ప్రెసెంట్ సీన్స్ చేశాం. ఆ రెండిటికీ పర్ఫెక్ట్ గా లుక్ సెట్ అయింది. శర్వా గారు ఎంటర్టైన్మెంట్ సినిమాలు అదరగొట్టేస్తారు. రన్ రాజా రన్, ఎక్స్‌ప్రెస్ రాజా, మహానుభావుడు.. తర్వాత ఆయన చేసిన ఎంటర్టైనర్ ఇది. చాలా ఫ్రెష్ గా కనిపిస్తారు. శర్వా గారితో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. సినిమా అంతా చాలా హ్యాపీగా జరిగింది.

**నరేష్ గారు మీకు లక్కీనా ?**
నరేష్ గారు అద్భుతమైన యాక్టర్. ఆయన అన్ని రకాల పాత్రలు చేస్తూ అలరిస్తున్నారు. నా సినిమాల్లో ఫాదర్ క్యారెక్టర్స్ కి అయిన పర్ఫెక్ట్ గా షూట్ అయ్యారు. ఈ సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఆయన పాత్ర ఉండబోతుంది.

**సంక్రాంతి సీజన్ మీకు కలిసి వస్తుందని భావిస్తున్నారా?**
సంక్రాంతి అడ్వాంటేజ్ ఉంటుంది. అయితే థియేటర్ కి వచ్చిన ఆడియన్స్ సినిమా బాగుందని బయటికి వెళ్తే దానితో వచ్చే మౌత్ టాకు సినిమాని బలంగా నిలబెడుతుంది. సామజవరగమన అలానే విజయవంతమైయింది.

**మీరు కథలు తయారు చేసుకునే విధానం ఎలా ఉంటుంది?**
నేను ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత భాను పరిచయమయ్యారు. అక్కడి నుంచి మా జర్నీ కొనసాగుతుంది. నా ప్రతి సినిమాకి భాను, నందు రైటర్స్ గా ఉన్నారు.

-ఎం.డి అబ్దుల్

## క్యూరియాసిటీ పెంచుతున్న
# కిశోర్ తిరుమల



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ప్రతీ రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని షేర్ చేస్తూ మూవీ లవర్స్ లో క్యూరియాసిటీ పెంచుతున్నాడు డైరెక్టర్ కిశోర్ తిరుమల . కాగా కిశోర్ తిరుమల తన దర్శకత్వ ప్రయాణానికి స్ఫూర్తిగా నిలిచిన సినిమాల గురించి చెప్పాడు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో టాలీవుడ్ యాక్టర్ రవితేజ నటిస్తోన్న చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ మూవీ జనవరి 12న విడుదల కానుందని తెలిసిందే. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో శోర్ తిరుమల అండ్ రవితేజ టీం ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ప్రతీ రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని షేర్ చేస్తూ మూవీ లవర్స్ లో క్యూరియాసిటీ పెంచుతున్నాడు. కాగా కిశోర్ తిరుమల తన దర్శకత్వ ప్రయాణానికి స్ఫూర్తిగా నిలిచిన సినిమాల గురించి చెప్పాడు. టైటానిక్, నిన్నే పెళ్లాడుతా, 7/జీ బృందావన్ కాలనీ సినిమాల ప్రభావం తనపై చాలా ఉంటుందని.. కెరీర్‌లో తాను డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టేందుకు ఈ చిత్రాలు స్ఫూర్తిగా నిలిచాయని చెప్పాడు. ఈ సినిమాలు తనకు భావోద్వేగాలను ఉన్న శక్తి, రిలేషన్‌షిప్స్, నిజాయితీతో కూడిన స్టోరీ టెల్లింగ్ గురించి నేర్పించాయన్నాడు కిశోర్ తిరుమల. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. భర్త మహాశయులకు విజ్ఞప్తి మూవీలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, ఖిలాడి ఫేం డింపుల్ హయతి ఫీమేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. భక్త మహాశయులకు విజ్ఞప్తి.. ఇవాళ 10:30 నిమిషాలకు స్వామి వారి కళ్యాణం.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**